అందరూ ఒక్క లైన్‌లోనే

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి ప్రవేశించేందుకు ఏర్పాటుచేసిన క్యూలైన్లు భక్తులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ప్రత్యేక దర్శనం ప్రవేశద్వారం గుండానే ఒకే సమయంలో బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణం భక్తులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆలయంలోకి అనుమతిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చిన సమయంలో తోపులాట జరుగుతోంది.

7

పత్తి రైతును వెంటాడుతున్న బీజీ-3

పత్తి రైతులను కల్తీభూతం వెంటాడుతోంది. నకిలీ, నాసిరకం విత్తనాల నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అధిక దిగుబడులు, తక్కువ ధర పేరుతో నాసిరకం, కల్తీ విత్తనాలు రైతులను ముంచుతున్నాయి. వేసవి ఆరంభం నుంచే గ్రామాల్లో మాటువేసిన ఏజెంట్లు తక్కువ ధరకు, అప్పుకింద ఇస్తామని రైతులను మభ్యపెట్టి కల్తీవిత్తనాలు అంటగడుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉంది. ప్రధానంగా పత్తిని వర్షాధార పంటగా సాగుచేసే రైతులను వీరు లక్ష్యంగా చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 రకం పత్తి విత్తనాలతో పాటు, లూజ్ విత్తనాలను రైతులకు అంటగడుతూ వ్యాపారులు, ఏజెంట్లు దండుకుంటుండగా, ఆ విత్తనాలు సాగుచేసిన రైతులు మాత్రం ఆశించిన దిగుబడులురాక నష్టాల పాలవుతున్నారు.

\- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

- అధిక దిగుబడులు, తక్కువ పెట్టుబడి నెపంతో రైతుల మొగ్గు
- భూసార క్షీణత, కాలుష్యకారకమవడంతో వీటిపై నిషేధం
- కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్



భూసారం తీవ్రంగా కోల్పోవడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి తీవ్రకారకంగా ఉంటుందనే శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో పత్తి విత్తనాల్లో బీజీ-3 రకాలను నిషేధించారు. కేవలం బీజీ-1, బీజీ-2 విత్తనాల ను మాత్రమే రైతులు సాగుచేయాలి. అయితే బీజీ-3 విత్తనాల ను అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు, వాటిని నేరుగా రైతులకు సరఫరాచేస్తున్నాయి. బీజీ-2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, అదే బీజీ-3 సాగుచేస్తే పంట దిగుబడి పూర్తయ్యేంతవరకు దోమపోటుతో పాటు, పురుగుల బెడద, తెగుళ్ల తాకిడి ఉండదనే ప్రచారంతో ఈ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి సైతం బీజీ-2 కంటే 30శాతం మేర ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు. పెట్టుబడిసైతం తగ్గుతుందని, పురుగుమందులు, దోమమందులు, తెగుళ్ల మందులు వినియోగించే అవసరం ఉండకపోవడంతో పెట్టుబడి సైతం 50 శా తం మేర తగ్గుతుందనే ప్రచారం బలంగా ఉండడంతో రైతులు సైతం బీజీ-3 విత్తనాల సాగుకు మొగ్గుచూపుతున్నారు. రైతులు బీజీ-2తో కలిపి బీజీ-3ని సాగుచేస్తున్న పరిస్థితి పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. నాలుగెకరా లు సాగుచేసే రైతులు మూడెకరాల్లో బీజీ-2 సాగు చేస్తే మరో ఎకరంలో బీజీ-3 సాగుచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు, నల్లగొండ, మోత్కూరు తదితర ప్రాంతాల్లో బీజీ-3 సా గు గణనీయంగా ఉంటుందని, దీన్ని అధికారులు గుర్తించి నియంత్రించలేకపోతున్నార ని, గడచిన నాలుగైదేళ్లుగా ఈ పరిస్థితి కొనసాగుతోందని, అందువల్లే పత్తి సాగు చేసే భూముల సారం తగ్గి, క్రమంగా దిగుబడులు తగ్గిపోతున్నాయ ని అవగాహన కలిగిన రైతులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. బీజీ-3 సా గును విత్తన దశలోనే అరికట్టాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవ డం లేదనే విమర్శలు ఉన్నాయి.ప్రధానంగా గుజరాత్, మహారాష్ట్రలోని విత్త న కంపెనీలు వాటి ఆర్‌అండ్‌డీ విభాగాల ద్వారా ఉత్పత్తిచేసి ఏపీలోని గుంటూరు,సత్తెనపల్లి, మాచర్లకర్నూల్‌కు చెందిన వ్యాపారుల ద్వారా, మరోవైపున తెలంగాణలోని గద్వాల, భూత్పూర్ ప్రాంతాలకు చెందిన డీలర్ల ద్వారా, అక్కడి నుంచి ఏజెంట్లకు ఈ విత్తనాలను పకడ్బందీ గా సరఫరాచేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ విత్తనాలు భారీగా పట్టుబడుతుండడమే దీనికి నిదర్శనం.

నకిలీల మూలాలను కట్టడిచేస్తేనే

బీజీ-3, ఫెయిల్ విత్తనాలను మార్కెట్లోకి రాకముందే తయారీ సందర్భంలోనే కట్టడి చేయడమే వీటి నియంత్రణకు ఏకైక పరిష్కారమనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా బీజీ-3 విత్తనాలను తీసుకువస్తున్న ముఠాలను గుర్తించి వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాల తయారీ కంపెనీలపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని, బీజీ-3, లూజ్ విత్తనాలను బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. జర్మినేషన్ పరీక్షల తర్వాత ఫెయిల్ విత్తనాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారమని రైతుసంఘాల నాయకులు సూచిస్తున్నారు.

వర్షాధారంగా సాగు చేసే రైతులే లక్ష్యం

మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా పత్తిని సాగు చేసే రైతులకు లూజ్ విత్తనాలు అంటగడుతున్నారు. మార్కెట్లో ధర కంటే తక్కువకు వీటిని...

\- మిగతా 7వ పేజీలో...

వ్యవసాయాభివృద్ధికి సహకార బ్యాంకుల తోడ్పాటు

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డి
- ఇండోనేషియా దేశంలో సదస్సుకు హాజరు



ఇండోనేషియాలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధికి సహకార బ్యాంకులు ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నాయని, వ్యవసాయ అనుబంధ రంగాల పురోగతికి భారత సహకార వ్యవస్థ అనుసంధానమై పనిచేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇండోనేషియా దేశంలోని బాలి నగరంలో బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా ఆధ్వర్యంలో ఆసియా-పసిఫిక్ దేశాలకు చెందిన సహకార బ్యాంకులు వ్యవసాయరంగానికి ఎలాంటి తోడ్పాటు అందిస్తున్నాయనే అంశంతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన సహకారంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రీజనల్ పాలసీ ఫోరం, 78వ ఆసియా-పసిఫిక్ రూరల్ అండ్ అగ్రికల్చర్ క్రెడిట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ సదస్సును నిర్వహించగా, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, భారతదేశంలో సహకార రంగం, సహకార బ్యాంకులు వ్యవసాయ, అనుబంధ రంగాల పురోభివృద్ధిలో కీలక భాగస్వామ్యం వహిస్తున్నాయన్నారు. ప్రధానంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించడమేగాక ఔత్సాహిక రైతాంగానికి సబ్సిడీలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు, సేవాసంస్థల ఏర్పాటుకు సహకార బ్యాంకులు వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొన్నారు.

పర్యావరణ సహితమైన వ్యవసాయ అనుబంధపరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడమే లక్ష్యంగా సహకార బ్యాంకులు మరింత బలంగా పనిచేయాల్సి ఉందన్నారు. వ్యర్థాలను వీలైనంతమేర నియంత్రించేలా సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాల్సి ఉందని తెలిపారు. భారతదేశంలో వ్యవసాయరంగమే నేటికీ అత్యధిక భాగం జనాభాకు జీవనోపాధి అందిస్తోందని, కీలకమైన ఈ రంగంలో సాంకేతిక అవృద్ధికి, ఆధునిక సాగువిధానాలకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించేలా సహకార బ్యాంకులకు తోడ్పాటు దక్కాలని పేర్కొన్నారు. ఈ నెల 28వరకు మూడురోజుల పాటు జరిగే ఇండోనేషియా పర్యటనలో వ్యవసాయరంగ అభివృద్ధిలో ఇండోనేషియా అవలంబిస్తున్న విధానాలను, అక్కడి సహకార బ్యాంకుల పనితీరు, వ్యవసాయ వ్యర్థాలు, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

ఈ రోహిణిలో రోళ్లు పగలవ్!





రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని పెద్దలు అంటుంటారు. సాధారణంగా మే నెలలో ఎండలు దారెత్తిస్తాయి. ఈ నెల 25 నుంచే రోహిణి కార్తె మొదలైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండాకాలం చివరిలో పలు ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. మండే ఎండలకు జనం ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు. ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు ప్రాణాలు కోల్పోయేవారు. అయితే ఈ ఏడాది మాత్రం వేసవి సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలిచింది.

\- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- వేసవి సంథింగ్ స్పెషల్
- ఇలాంటి కూల్ సమ్మర్ లేదని నిపుణుల అభిప్రాయం
- 16ఏళ్ల తర్వాత ముందస్తు రుతుపవనాలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వేసవి ప్రత్యేకతలను సంతరించుకుంది. ఎండల్లో హాయ్‌హాయ్.. అనే పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో విజృంభించే వేసవి ఛాయలు ఈసారి ఫిబ్రవరి నెలాఖరులోనే మొదలయ్యాయి. మే నెలలో మలమలా మాడ్చాల్సిన మండుటెండలు మనసు మార్చుకుని వర్షాలు కురిపిస్తున్నాయి. భయపెట్టే తీవ్ర వడగాడ్పుల జాడే లేకుండా పోయాయి. ఇక జూన్ ఆరంభంలోనే తాకాల్సిన నైరుతి రుతుపవనాలు ఎనిమిది రోజుల ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. అన్నింటికీ మించి రోళ్ల పగిలేలా ఎండలు ఉంటాయని చెప్పుకునే రోహిణి కార్తెలో చల్లని వాతావరణం ఏర్పడింది. మరోవైపు వచ్చే వారం పది రోజుల పాటు అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తూ పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-5డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖ తాజాగా ప్రకటించింది.

ఈ ఏడాదిలో 43 డిగ్రీలకు మించలేదు

ఈ ఏడాది వేసవిలో మొత్తం ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీలకు మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాలేదు. అదికూడా ఏప్రిల్ నెలలోనే నమోదయ్యాయి. ఈ సారి మే నెలలో 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు తొలుత అంచనా వేశారు. కానీ, మారిన వాతావరణ పరిస్థితులతో అందుకు భిన్నంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అయితే ఎండాకాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో జిల్లాలోని తుర్కపల్లి, రాజపేట, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, తదితర మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు సుమారు రూ.14కోట్ల మేరకు పంట నష్టాన్ని చవిచూశారు. కాగా, ఈ సారి వడదెబ్బ మరణాలు కూడా చాలా తక్కువగా నమోదయ్యాయి.



16ఏళ్ల తర్వాత ముందస్తు రుతుపవనాలు...

గతంలో నైరుతి రుతుపవనాలు నిర్ణీత సమయం కంటే కొన్ని రోజులు ముందుగానే కేరళను తాకిన తరువాత కొద్దిరోజులకు వాతావరణం చల్లబడేది. రోహిణి కార్తె వేళ ఉష్ణతీవ్రత ఉండేదని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా మే నెలంతా కూడా వర్షాలు, మబ్బులతో చల్లదనాన్ని పరిచింది. గడిచిన ఏళ్లలో ఇలాంటి కూల్ సమ్మర్‌ను చూడలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎప్పుడైనా మే నెలలో తుఫాన్లు ఏర్పడితే ఐదారు రోజులు చల్లదనం ఉండేది తప్ప ఇంతలా ఎప్పుడూలేదు. 2009లో నైరుతి రుతుపవనా లు తొమ్మిది రోజులు ముందుగా రాగా, ఆ తర్వాత కూడా కొన్నాళ్ల పాటు ఎండలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరుకు ముందే తుపాన్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తే మంచి వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడిస్తోంది.

పలకరించిన తొలకరి...

తొలకరి పలకరించడంతో పంటలను సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. వానాకాలం పంటలను ముందస్తుగానే సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వరి నూర్పిడి పను లు చేసిన రైతులంతా దుక్కులు దున్ని, చేలను సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో యాదాద్రి జిల్లాలో వానాకాలంలో 4.50లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. అందులో వరి, పత్తి అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. సాధారణంగా 2.60లక్షల వరకు వరి సాగుకానుంది. ఈసారి పత్తి 1.15లక్షల ఎకరాల వరకు సాగుచేసే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు 73,750క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచారు. జిల్లావ్యాప్తంగా 13,575 ఎకరాల్లో కూరగాయల తోటలు సాగవుతుండగా, ఈసారి కూరగాయల సాగును 20వేల ఎకరాలకు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారుల ఫిర్యాదులను ఎస్పీ తీసుకొని వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సదరు సమస్యలపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదుదారుడికి పోలీసులపై భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నారాయణ్‌అమిత్



ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఐఏఎస్ అధికారి నారాయణ్ అమిత్‌కు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల)గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సెలవు నుంచి తిరిగి వచ్చిన అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్ సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన నారాయణ్‌అమిత్ ఇకపై అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ (స్థానిక సంస్థల)గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా, బాధ్యతలు తీ సుకున్న నారాయణ్‌అమిత్‌కు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన లైసెన్స్ సర్వేయర్ల ధ్రువపత్రాల పరిశీల న,సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26 నుంచి సుమారు 50 పనిదినాలు సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, వివాదాల పరిష్కారంలో సర్వేయర్లది కీలకపాత్ర అన్నారు. శిక్షణకు హాజరైన సర్వేయర్లు జాగ్రత్తగా అన్ని అంశాలను అర్థం చే సుకోవాలన్నారు. అనంతరం 150 మంది లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సామగ్రిని పంపిణీ చేశారు. కాగా, జిల్లా లో లైసెన్స్ సర్వేయర్లు మీ-సేవ ద్వారా 819 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి విడత సోమవారం 409 మంది ధ్రువపత్రాలు పరిశీలించారు. రెండో విడత ఆగ స్టులో మరో 410 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇన్‌చార్జి ఏడీ సుజాత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పంపించిన రైతు ఆత్మహత్యల జాబితా, సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన వితంతు పెన్షన్ కుటుంబాల జాబితా ఆధారంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నారు. అర్హులు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు చేయవచ్చన్నారు. వీటిపై తహసీల్దార్లు విచారణ నిర్వహించి జాబితాను ఆర్డీవోకు, అక్కడి నుంచి జిల్లా రెవెన్యూ అధికారికి, ఎస్‌ఎస్ డైరెక్టర్, సెర్ప్ సీఈవోకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాలకు స్థలాలను కేటాయించాలి

జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాకు మంజూరైన 22 ఆరోగ్య ఉప కేంద్రాలకు వెంటనే స్థలాలు కేటాయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో 22 నూతన సబ్ సెంటర్లకు స్థలాలను గుర్తించి కేటాయించాలన్నారు. ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

'ప్రజావాణి' ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకొని ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ధర్తి ఆబా యోజన, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం, పౌరసరఫరాలశాఖపై సమీక్ష నిర్వహించారు. వానాకాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలతోపాటు, అంతర్ పంటలు సాగుచేసేలా ప్రోత్సహించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలి

బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నేత మధుసూదన్‌రెడ్డి



నిరసన తెలుపుతున్న కిసాన్‌మోర్చా నాయకులు

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రాంభమవుతున్నందున రైతులకు నాణ్యమై విత్తనాలు, ఎరువులు అందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు, ఆ పార్టీ కేరళ రాష్ట్ర ఇన్‌చార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైనవి సకాలంలో అందజేయాలన్నారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు అరికట్టేందుకు జిల్లా స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ చేసి రైతుభరోసా డబ్బు వెంటనే జమచేయాలన్నారు. యాసంగిలో విక్రయించిన సన్న ధాన్యానికి వెంటనే బోనస్ చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమాను వర్తింపజేయాలని, మిల్లెట్‌పంటలను ప్రోత్సహించాలని, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, నాయకులు పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాపిరెడ్డి, మహేష్, హనుమంతురెడ్డి, అశోక్‌రెడ్డి, సాయన్న, నవీన్‌రెడ్డి, రమణముదిరాజ్, రాజయ్య, కోటేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జేడీఏతో రేపు ఫోన్ ఇన్

- ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
- సంప్రదించాల్సిన నెంబర్ 8977751296



నల్లగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో జిల్లా రైతాంగానికి వ్యవసాయ సంబంధిత సమాచారం అందించేందుకు ఈనెల 28న బుధవారం జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. వానాకాలం సీజన్‌లో కావాల్సిన ఎరువులు, విత్తనాలతో పాటు ఇతర అంశాల గురించి జేడీఏను రైతులు ప్రశ్నించవచ్చు. రైతులు సెల్ నెంబర్ 8977751296కు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.



నూతన జిల్లా కోర్టు నిర్మించనున్న స్థలం

కోర్టు నిర్మాణానికి ఖరారైన టెండర్లు

4.82 శాతం ఎక్కువతో పనులు దక్కించుకున్న కేఎంవీ ప్రాజెక్స్

భువనగిరి టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కోర్టు నూతన భవన నిర్మాణ టెండర్లు ఖరారయ్యాయి. రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన పనులను 4.82 శాతం ఎక్కువతో కేఎంవీ ప్రాజెక్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ పనులను దక్కించుకుంది. అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయ్యాక ఒకటి రెండు నెలల్లో పనులు ప్రారంభం కానున్నట్టు తెలిసింది. రూ.81 కోట్లలో 60 శాతం కేంద్రం ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించనున్నాయి. పట్టణ శివారు మాసుకుంటలోని సర్వేనెంబర్ 742లోని ప్రభుత్వ స్థలంలో కేటాయించిన 10 ఎకరాల స్థలంలో జిల్లా కోర్టులు, కార్యాలయాలు, న్యాయమూర్తులు క్వార్టర్స్, బార్ అసోసియేషన్ తదితర భవనాలను నిర్మించనున్నారు. నూతన భవనాల నిర్మాణం పూర్తయితే జిల్లా కోర్టుకు భవనాల మౌలిక వసతుల కొరత తదితర ఇక్కట్లు తప్పనున్నాయి. అదే సమయంలో నూతన భవనంలో జిల్లా కోర్టు ప్రారంభమయ్యాక ఆ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. అయితే నూతన కోర్టు ప్రారంభమయ్యాక ఖాళీ అయ్యే ప్రస్తుత విలువైన కోర్టు స్థలం వినియోగంపై న్యాయశాఖతో కలిసి ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

సూర్యాపేట క్రైం, మే 26 (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో సూర్యాపేట సెకండ్‌క్లాస్ జ్యుడీషియల్ కోర్టు ఆరుగురికి జైలు, పలువురికి జరిమానా విధించినట్లు సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. ఈ నెల 25న సూర్యాపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. 18 మంది మోతాదుకు మించి మద్యం తాగినట్లు గుర్తించి వారిని సోమవారం సూర్యాపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ బీవీ రమణ ఇద్దరికి రెండు రోజులు, మరో నలుగురికి ఒక్క రోజు జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. 2వేల జరిమానా విధించినట్లు తెలిపారు. అదే విధంగా మిగిలిన 12మందికి కలిపి రూ.16,500 జరిమానా విధించినట్లు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారని స్పష్టం చేశారు. వాహనాలు నడిపే వారు విధిగా నిబంధనలు పాటించాలన్నారు.

నత్తనడకన మోడల్‌కాలనీ పనులు


హుజూర్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న మోడల్‌కాలనీ

- మంత్రి ఉత్తమ్ ఆదేశాలు బేఖాతర్
- రూ.74.80 కోట్లతో పునరుద్ధరణ

పదేళ్ల కిందట సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని చేపట్టిన మోడల్‌కాలనీ పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. నిధులు పుష్కలంగా ఉన్నా పనులు సాగదీస్తున్నారు. ఆరు నెలల్లో పూర్తిచేయాలని మంత్రి ఉత్తమ్ ఆదేశించి ఏడాది దాటింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్లే పనులు ముందుకు సాగడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రుల నుంచి ఉన్నతాధికారుల వరకు పనుల పూర్తికి ఉరుకులు పెట్టించినా ఫలితం కనిపించడం లేదు. దశాబ్దం తరువాత ఇళ్ల కల నెరవేరుతుందని ఆశపడ్డ నిరుపేదలకు నిరాశే ఎదురవుతోంది.

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హుజూర్‌పట్టణంలోని ఫణిగిరిగట్టు వద్ద ఉన్న దేవాదాయ శాఖ భూములను హైకోర్టు అనుమతితో రెవెన్యూ శాఖకు కొనుగోలు చేయించి అందులో మోడల్ కాలనీ పనులను ప్రారంభించారు. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తన నియోజకవర్గమైన హుజూర్‌నగర్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 135 బ్లాక్‌లలో 2,160 ఇళ్లకు జీప్లస్ పద్ధతిలో మోడల్‌కాలనీకి ప్రణాళికలు రూపొందించారు. ఈ ప్రాజెక్టుకు రూ.98.51 కోట్లు మంజూరు కాగా 2014 జనరిలో జీప్లస్-1 మోడల్ కాలనీ పనులు ప్రారంభించారు. అందులో రూ.34.63 కోట్ల పనులు పూర్తిచేశారు. అదేవిధంగా ఈ కాలనీ పక్కనే మరో 1000 వ్యక్తిగత గృహాలకు ఉత్తమ్ శంకుస్థాపన చేయించి 270మంది పేదలకు 2014లోనే ఇందిరమ్మ ఇళ్లు మంజూరుచేయించి ఇళ్లు కట్టించారు.


2016 నుంచి నిలిచిన పనులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక రెండు పర్యాయాలు కొలువుదీరిన బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లుగా మోడల్ కాలనీ పనులను నిర్లక్ష్యం చేసింది. దీంతో కాలనీ ప్రాంతం డంప్‌యార్డ్‌గా మారి అస్తవ్యస్తమైంది. మోడల్‌కాలనీ పనులు 2016 నుంచి పూర్తిగా నిలిచిపోయాయి. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, జగదీష్‌రెడ్డిలు అనేకమార్లు ఈ పథకాన్ని పూర్తి చేస్తామని హామీలు ఇచ్చి విస్మరించారు. గత ప్రభుత్వ హయాంలో మోడల్‌కాలనీని డంపింగ్ యార్డ్‌గా మార్చారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి రావడంతో కాలనీ పునరుద్ధరణకు మోక్షం కలిగింది. ప్రస్తుత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిసెంబరు 5న గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని తీసుకొచ్చి కాలనీ పునరుద్ధరణ పనులకు శంకుస్థాపన చేయగా, గతేడాది జనవరి నుంచి పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం 135 బ్లాక్‌లు, 2,160 ఇళ్లకు 91 బ్లాక్‌లకు సంబంధించి ఇళ్లు పూర్తి చేశారు. మరో 40 బ్లాక్‌లకు సంబంధించి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి గతేడాది జనవరి 29న రూ.74.80 కోట్లు మంజూరు చేయగా సుమారు రూ.35.82 కోట్లు ఖర్చు చేశారు. మిగిలిన పనులు నత్తనడకను జరుగుతున్నాయి.

లబ్ధిదారుల ఎంపికకు ఆదేశాలు..

ఇదిలా ఉండగా మోడల్‌కాలనీ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆదేశించింది. ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఎంపిక జరగాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిమ్మ ఇళ్లు మంజూరు చేస్తోంది. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇళ్ల పనులు కొనసాగుతున్నాయి. హుజూర్‌నగర్ మునిసిపాలిటీలో మాత్రం మోడల్‌కాలనీ ఇళ్లను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం సమాయత్తమవుతోంది. కాలనీనిర్మాణం పూర్తయితే సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పేదలకు పంపిణీ చేసే అవకాశాలు ఉన్నాయి.

రెండు పనులు మోడల్‌కాలనీ పనులు పూర్తి



మోడల్‌కాలనీ పనులు రెండు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించాం. పనులు పూర్తిచేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటాం. నిర్మాణంలో పూర్తి నాణ్యత ఉండాలి. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా ఉండాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు. పట్టణంలో అర్హత కలిగిన పేదలకు ఇళ్లు ఇస్తాం.

\- ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి

మంత్రులు ఆదేశించినా...

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మంత్రి ఉత్తమ్ ఏడాదిన్నర కాలంగా పనులు పూర్తిచేయాలని ఆదేశించి అనేకసార్లు పర్యటనలు చేసి, సీఎం రేవంత్‌రెడ్డికి చూపించి, మంత్రి పొంగులేటితో నిధులు మంజూరు చేయించినా పనులు మాత్రం మందకొడిగా సాగుతున్నాయి. కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ చాలాసార్లు కాలనీ పనులను పర్యవేక్షించారు. హౌసింగ్ ఎండీ గౌతమ్ ప్రత్యేక దృష్టి సారించారు. మంత్రుల నుంచి ఉన్నతాధికారుల వరకు ఎన్నిసార్లు పనులు పూర్తి చేయాలని ఆదేశించి కాంట్రాక్ట్ తీరు మాత్రం మారడం లేదు.



రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారు. రోజుకు 1000 మంది కూలీలు, మేస్త్రీలతో పనిచేయాలని మంత్రి ఉత్తమ్, కలెక్టర్ చెప్పినా అతను పెడచెవిన పెడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మూడు రోజుల కిందట మంత్రి ఉత్తమ్ మోడల్ కాలనీ పనుల పర్యవేక్షణకు వెళ్లగా నెల రోజుల్లో పనులు పూర్తిచేస్తామని కాంట్రాక్టర్ చెప్పినా పరిస్థితి అలా కనిపించడంలేదు.

పండుగలా ప్రారంభించాలని..

- నూతన విద్యాసంవత్సరానికి పాఠశాలలను సిద్ధం చేస్తున్న యంత్రాంగం
- తొలిరోజే యూనిఫాం, పాఠ్యపుస్తకాల అందజేతకు సన్నాహాలు



పాఠశాలలకు పాఠ్యపుస్తకాల సరఫరాను ప్రారంభిస్తున్న డీఈవో సత్యనారాయణ

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

నూతన విద్యాసంవత్సరాన్ని ఘనంగా ప్రారంభించేందుకు విద్యాశాఖ తీవ్రంగా శ్రమిస్తోంది. 2025-26 విద్యాసంవత్సరం తొలిరోజు జూన్ 12న పండుగ వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలలను పునఃప్రారంభించాలని తలపిస్తోంది. తొలిరోజునే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించనున్నారు. అలాగే ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు అధికారులు కార్యాచరణ రూపొందించారు. మన ఊరు మనబడి, అమ్మ ఆదర్శ పాఠశాల పథకాలతో ప్రతిపాదించిన పనులు పూర్తయ్యేలా కృషి చేస్తున్నారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలతో పోటీ పడుతుండటం, అర్హులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు, మధ్యాహ్న భోజనం ఉన్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలతోనే పిల్లల భవిష్యత్ భద్రంగా ఉంటుందనే నిజాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

తొలిరోజునే...

విద్యాసంవత్సరం తొలిరోజునే పిల్లలకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందనున్నాయి. ఈ మేరకు యాదాద్రిభువనగిరి జిల్లాలో 715 ప్రభుత్వ పాఠశాలలలో ప్రస్తుతం 38వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఇందుకోసం 142 టైటిల్స్‌లో 2,91,760 పాఠ్యపుస్తకాలకు ఇప్పటివరకు 128 టైటిల్స్‌లో 2,50,440(85.83 శాతం) పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరాయి. ఈ మేరకు పుస్తకాల సరఫరా కూడా ప్రారంభమైంది. ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫామ్స్‌లో మొదటి రోజున ఒకటి చొప్పున మరొకటి నెల రోజుల అనంతరం ఇవ్వనున్నారు. ఇందుకోసం మహిళా సంఘాలు 43,506 యూనిఫామ్స్‌ను సిద్ధం చేస్తున్నాయి. త్వరలోనే అవి పాఠశాలలకు చేరనున్నాయి.

జూన్ 6 నుంచి బడిబాట

ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలను పెంచే లక్ష్యంతో జూన్ 6 నుంచి 19 వరకు బడిబాట చేపడుతున్నారు. జూన్ 6న గ్రామసభలు, 7న బడిఈడు పిల్లల గుర్తింపు సర్వే, 8, 9, 10వ తేదీల్లో కరపత్రాలతో ఇంటింటా ప్రచారం, డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి తిరిగి పాఠశాలలో చేర్పించనున్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించడం. 6 నుంచి 10 వరకు నిర్వహించిన కార్యక్రమాలపై 11న సమీక్ష, 12న పాఠశాలల పునఃప్రారంభం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు చేపట్టిన అభివృద్ధి పనుల ప్రారంభం చేపట్టనున్నారు. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలల సభ, 16న ఫౌండేషన్ లిటరేస్ అండ్ న్యూమరసి(ఎఫ్ఎల్ఎన్), లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ డే (ఎల్ఐపీ). 17న విలీన విద్య, బాలిక దినోత్సవం, 18న డిజిటల్ తరగతులపై అవగాహన, 19వ బడిబాట ముగింపును పురస్కరించుకొని క్రీడాపోటీలు నిర్వహిస్తారు.



తొలిరోజు నాటికి సమస్యల పరిష్కారం

పాఠశాలలు తెరుచుకునే తొలి రోజు నాటికి సమస్యలను పరిష్కరిస్తాం. ప్రైవేట్ పాఠశాలలతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతులు అందుతున్నాయి. పదో తరగతి పరీక్షా ఫలితాలు కూడా గతం కంటే మెరుగయ్యాయి. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే లక్ష్యంతో బడిబాట నిర్వహిస్తాం.

సత్యనారాయణ, డీఈవో, యాదాద్రిభువనగిరి జిల్లా

అసంపూర్తిగా అభివృద్ధి పనులు

కార్పొరేట్ స్థాయి సదుపాయాలు లక్ష్యంగా మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల పథకాల పేరిట చేపట్టిన పలు అభివృద్ధి పనులు నేటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో పలు పాఠశాలలో సమస్యలు వెంటాడనున్నాయి. గత ప్రభుత్వం మన ఊరు-మనబడిలో భాగంగా మొదటి దఫాగా 251 పాఠశాలలో రూ.48 కోట్లతో చేపట్టిన పలు పనులు అసంపూర్తిగా ఉన్నాయి. బిల్లుల చెల్లింపు పర్యవేక్షణ లోపం తదితర కారణాలతో నిలిచిన అసంపూర్తి పనులతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అయితే పనులు పూర్తయిన పాఠశాలల మాత్రం విద్యార్థులను అలరిస్తున్నాయి. అలాగే ప్రస్తుత ప్రభుత్వం 558 పాఠశాలలో రూ.23.81 కోట్లతో ప్రతి పాఠశాలలలో తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు, విద్యుత్ కనెక్షన్, ఫ్యాన్లు, లైట్ల బిగింపు, ఇతర మరమ్మతులు మొత్తంగా 3,918 పనులు చేపట్టారు. ఈ మేరకు ఇప్పటివరకు 545 పాఠశాలలో ప్రతిపాదిత పనులు పూర్తి చేశారు.

వేధిస్తున్న సమస్యలు

అభివృద్ధి పనులు ప్రతిపాదించి పూర్తి చేస్తున్నప్పటికీ పలు పాఠశాలను నేటికీ పలు సమస్యలు వేధిస్తున్నాయి. మెజార్టీ పాఠశాలలకు ప్రహరీ లేకపోవడం, రంగులు వేయకపోవడంతో పాత భవనాలను తలపిస్తున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థులకు సరిపడా మూత్రశాలలు, తరగతి గదులు లేకపోవడం, మరికొన్ని పాఠశాలలో తాగునీటి కొరత ఉంది.అలాగే ఇంకా కొన్ని పాఠశాలల్లో డిజిటల్ తరగతులు ఏర్పాటుచేయాల్సి ఉంది. ల్యాబ్, గ్రంథాలయాలు, క్రీడాసామగ్రి ఆశించిన స్థాయిలో లేకపోవడం విద్యార్థులను నిరుత్సాహానికి గురిచేస్తోంది.

పోచంపల్లి అర్బన్ బ్యాంక్‌కు జాతీయ అవార్డులు


జాతీయ అవార్డులను అందుకుంటున్న పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్

భూదాన్‌పోచంపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): బీ2బీ ఇన్‌ఫోమీడియా 2024-25 ఆర్థిక సంవత్సరానికి అందజేసిన అవార్డుల ప్రదానోత్సవంలో యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు రెండు జాతీయ అవార్డులను గెలుచుకుందని బ్యాంక్ చైర్మన్ తడక రమేష్, సీఈవో సీత శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 23న ముంబయిలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ సుమిత్ జోషి అవార్డులను అందజేసినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పోచంపల్లి కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్-2025 మార్చి నాటికి రూ.236.54 కోట్ల డిపాజిట్లు సేకరించగా, రూ.167.98 కోట్లు రుణాలుగా చెల్లించినట్లు తెలిపారు. వచ్చే మార్చి నాటికి బ్యాంక్ శాఖలు 22కు చేరుతాయన్నారు. పోచంపల్లి అర్బన్ బ్యాంకు ప్రతి ఏడాది అవార్డులను సాధించడంపై ఖాతాదారులు, వాటాదారులు, వ్యవస్థాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో బ్యాంకు వైస్‌చైర్మన్ భారత రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు కర్నాటి బాలసుబ్రహ్మణ్యం, ఏలె హరిశంకర్, సూరపల్లి రమేష్, రాపోలు వేణు, గుండు కావ్య, కర్నాటి భార్గవి, కొండమడుగు ఎల్లస్వామి, బిట్టు భాస్కర్, మక్తాల నర్సింహ పాల్గొన్నారు.

భక్తులకు ఏర్పాట్లు చేయండి: మంత్రి కోమటిరెడ్డి


దర్వేశిపురం ఆలయ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కోమటిరెడ్డి

కనగల్, మే 26 (ఆంధ్రజ్యోతి) :నల్లగొండ జిల్లా కనగల్ మండలంలో దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. జూన్ 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే ఆలయ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను హైదరాబాద్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆయన సోమవారం ఆవిష్కరించి, మాట్లాడారు. ఎల్లమ్మ తల్లి ఎంతో మహిమానిత్యం గల దేవత అని అన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులను కల్పించాలని ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్యకు సూచించారు. కార్యక్రమంలో బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, గుమ్మల మోహన్‌రెడ్డి, బోగరి రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ జినుకుంట్ల చంద్రయ్య, ఉపేందర్‌రెడ్డి, అర్చకులు శ్రవణ్‌కుమారాచార్యులు, ఉమామహేశ్వర్, ధర్మకర్తలు రమేష్, రాజు, దుర్గమ్మ, వెంకన్న, నవీన్ సైదులు, అంజయ్య తదితరులున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్ట్, ముగ్గురు పరారీ

తిరుమలగిరి(సాగర్), మే 26 (ఆంధ్రజ్యోతి): డబ్బులను పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అల్వాల గ్రామశివారులో సాయంత్రం పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లారు. వారి రాకను గమనించి పేకాడుతున్న వారు పారిపోతుండగా ఐదుగురిని పట్టుకున్నారు. ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన వారిలో జటావత్ ప్రభాకర్, సోమ సుదర్శన్, ఆంగోతు లక్పతి, రమావత్ లచ్చిరాం, రమావత్ హనుమలుగా గుర్తించారు. అదేవిధంగా పారిపోయిన వారిలో రమేష్, ఆర్.శ్రవణ్‌కుమార్, బావోజీలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పట్టుబడిన వారి నుంచి రూ.30,200 నగదు, ఐదు మొబైల్స్, ఐదు బైక్‌లను సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్ల ఎస్ఐ తెలిపారు.

ఎల్లారెడ్డిగూడెంలో ఆటో చోరీ

నార్కట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో ఆదివారం రాత్రి ఆటో చోరీకి గురైంది. ఆటో యజమాని బోయపల్లి శివ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రోజు మాదిరిగానే ఆదివారం తన ఆటోను ఇంటి ముందు పార్క్ చేశాడు. అర్ధరాత్రి మూత్రవిసర్జనకు లేచి ఇంటి బయటకు రాగా ఆటో లేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించలేదు. ఆటో పార్క్ చేసిన పక్కనే గుర్తుతెలియని బైక్ పార్క్ చేసి ఉండటం గమనించాడు. సోమవారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు శివ తెలిపాడు. ఆటో విలువ రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

మావోయిస్టుల మృతదేహాలను ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న వేనేపల్లి పాండురంగారావు

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌ఘడ్ అడవుల్లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పజెప్పకపోవడం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల క్రూరత్వానికి నిదర్శనమని ప్రజాసంఘాల నేతలు విమర్శించారు. మృతదేహాల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాన్ని నిరసిస్తూ నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్థానిక అంబేడ్కర్ భవన్‌లో సోమవారం ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గుజరాత్‌లో ప్రారంభించిన నరమేధాన్ని దేశం మొత్తం వ్యాప్తి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన నంబాల కేశవరావు, నాగేశ్వరరావు, విజయలక్ష్మి, రాకేష్, సంగీత మృతదేహాలను మాత్రమే ఇవ్వకపోవడానికి గల కారణాలు ఏమిటో ప్రజల ముందు ఉంచాలన్నారు. ఆయా మృతదేహాల కోసం కుటుంబ సభ్యులు ఐదు రోజులుగా పడిగాపులు కాస్తున్నా ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వం గానీ, కేంద్ర ప్రభుత్వం గానీ వారికి ఇవ్వకుండా బెదిరింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మృతదేహాలకు అంతిమ సంస్కారం చేయడం గౌరవప్రదంగా ఉంటుందని, తక్షణమే ఆ మృతదేహాలను బంధువులకు కుటుంబాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, సుధాకర్ రెడ్డి, పందుల సైదులు, రామయ్య, జానకీరామ్ రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, పాలడుగు నాగార్జున, కోమటిరెడ్డి అనంతరెడ్డి, తోట నరసింహచారి, మోతుకూరి శ్రీనివాస్, ఆర్.శ్రీనివాస్, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాన్‌పహాడ్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణాలు దగ్ధం

- రూ.10 లక్షల ఆస్తి నష్టం


మంటల్లో దగ్ధమవుతున్న దుకాణాలు

పాలకవీడు, మే 26 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా జాన్‌పహాడ్ దర్గా సమీపంలోని పలు పూజా సామగ్రి విక్రయించే దుకాణాలు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమయ్యాయి. ఈ సంఘటనలో రూ.10 లక్షల విలువైన సామగ్రి బూడిదైంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం జాన్‌పహాడ్ దర్గా సమీపంలో కొబ్బరికాయలు, పూజాసామగ్రి, ఆటవస్తువులు విక్రయించే దుకాణాల్లో సోమవారం తెల్లారుజామున నాలుగు గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. ఎస్‌కే సైదా, ఎస్‌కే జానీ, ఎస్‌కే బాషాలకు చెందిన మూడు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. కొద్ది సమయంలో మంటలు ఎగిసిపడ్డాయి. సుమారు రూ.10 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ట్రాన్స్‌కో ఏఈ పందిరి శ్రీనివాస్‌ను మాట్లాడుతూ సోమవారం తెల్లారుజామున కురిసిన వర్షానికి ఓ దుకాణంలో కరెంట్ తీగలు తడిసి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని మూడు దుకాణాలు దగ్ధమైనట్లు తెలిపారు. ఈ సంఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపారు.

భార్యాభర్తలను బలిగొన్న కుటుంబకలహాలు

14 రోజుల్లో ఇద్దరి ఆత్మహత్య


గోశిక భాస్కర్, నవ్య(ఫైల్‌ఫొటో)

చౌటుప్పల్ రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో 14 రోజుల వ్యవధిలో భార్యాభర్తలు బలవన్మరణం చెందారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెంలో ఈ విషాదం నెలకొంది. చౌటుప్పల్ సీఐ మన్మధకుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొయ్యలగూడెం గ్రామానికి చెందిన గోశిక భాస్కర్(42) చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. గ్రామానికి చెందిన నవ్య(34)ను ప్రేమవివాహం చేసుకోగా, వీరికి కుమారుడు సుభాష్ (8), కుమార్తె మహాలక్ష్మి(4) ఉన్నారు. ఇటీవల మద్యానికి బానిసైన భాస్కర్ భార్యను వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో నవ్య మనస్తాపానికి గురై ఈ నెల 13న చేనేత వస్త్రాలకు ఉపయోగించే రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకుంది. నవ్య మృతికి భర్త భాస్కర్, కుటుంబ సభ్యులే కారణమని ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు భర్త భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులపై పోలీసులు కేసు నమోదుచేశారు. భాస్కర్‌తో పాటు కుటుంబ సభ్యులను రిమాండ్‌కు తరలించాల్సి ఉంది. దీంతో మనస్తాపానికి గురైన భాస్కర్ సోమవారం రసాయన ద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రుల మృతితో పిల్లలు ఒంటరివారయ్యారు. నవ్య కుటుంబ సభ్యుల వేధింపులతోనే భాస్కర్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మధకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ మృతి


ఉపేందర్(ఫైల్)

నార్కట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబులెన్స్ డ్రైవర్ మృతి చెందాడు. గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలిలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామానికి చెందిన ఏర్పుల ఉపేందర్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తూ నార్కట్‌పల్లిలోనే భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెతో ఉంటున్నాడు. ఆదివారం రాత్రి కామినేని ఆసుపత్రి వద్ద అంబులెన్స్‌ను పార్క్ చేసి రాత్రి 10 గంటల సమయంలో బైక్‌పై సర్వీస్ రోడ్డు మీదుగా ఇంటికి వస్తున్నాడు. ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కగా ఉన్న డ్రైనేజీపై పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయంలో హెరిటేజ్ సంస్థలో పనులు ముగించుకుని నార్కట్‌పల్లి వైపునకు వస్తున్న ఉద్యోగులు ఉపేందర్‌ను చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఉపేందర్‌ను గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. భార్య ఏర్పుల మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

అందరూ ఒక్క లైన్‌లోనే..



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దర్శనార్థం తరలివచ్చే భక్తులు సరైన క్యూలైన్లు లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు ఆలయంలోకి ప్రవేశించేందుకు ప్రత్యేక దర్శనం ప్రవేశద్వారం గుండానే ఒకే సమయంలో బ్రేక్ దర్శ నం, నిత్య కల్యాణం భక్తులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆలయంలోకి అనుమతిస్తున్నారు. ఒకే క్యూలైన్ ద్వారా ఒకేసారి అధిక సంఖ్యలో భక్తులు ఆలయంలో వెళ్లే సమయంలో తోపులాట జరిగి భక్తులు అసహనానికి గురవుతున్నారు. క్యూలైన్లు వేర్వేరుగా ఏర్పాటు చేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు ఇక్కట్లు తప్పడం లేదు. గుంపులుగా వచ్చే భక్తులను సిబ్బంది కూడా అదుపు చేయలేక పక్కనే ఉన్న సెల్‌ఫోన్ కౌంటర్ సిబ్బంది కూడా పని చేయాల్సి వస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,యాదగిరిగుట్ట)

- ఒకే క్యూలైన్‌తో భక్తుల ఇక్కట్లు
- బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణ భక్తులకు ఇబ్బందులు

ధర్మదర్శనం క్యూలైన్ మినహా ప్రత్యేక, బ్రేక్, నిత్య కల్యాణం నిర్వహించేందుకు టికెట్లు పొందిన భక్తులు ఒకే క్యూలైన్ ద్వారా అనుమతించడంతో భక్తులకు తోపులాటలు, వాగ్వాదాలతో ఆలయ ప్రవేశం కష్టతరంగా మారింది. అందరూ ఒకేసారి రావడంతో సరైన క్యూలైన్ వసతి లేక భక్తులను సముదాయించలేక ఆలయ సిబ్బంది కూడా విసుగెత్తిపోతున్నారు. ఇది కేవలం నిత్యం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు క్యూలైన్ కోసం ఇబ్బందులు తలెత్తుతోంది. అధికారులు ఈ సమస్య పరిష్కరించేందుకు చొరవ చూపడం లేదు. భక్తులకు ఆలయ ప్రవేశం కోసం ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేయడంలో విఫలమయ్యారు.

ఒకే క్యూలైన్ నుంచే భక్తుల ప్రవేశం

నిత్యం స్వామివారిని దర్శించుకునేందుకు తరలి వచ్చే భక్తులకు రూ.150 టికెట్ ద్వారా ప్రత్యేక దర్శనం కలుగుతోంది. ఇందుకోసం ప్రత్యేకంగా ఆలయ ఈశాన్య దిక్కులో క్యూలైన్ ఏర్పాటు చేశారు. ఇదే క్యూలైన్ గుండా ఉదయం 9 నుంచి 10 గంటల వరకు బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణం భక్తులను వదులుతున్నారు. ఇక్కడే రూ.150 టికెట్ కౌంటర్, సెల్‌ఫోన్లు భద్రపరిచే కౌంటర్ ఇరువైపులా ఉండటంతో అక్కడ ఆల య ప్రాకార మండపం పూర్తిగా నిండిపోతోంది. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య మూడు రకాల టికెట్లు పొందిన భక్తులు ఒకే చోటికి చేరుకుంటున్నారు. అయితే రూ. 150 టికెట్ భక్తులను మాత్రం గంట పాటు క్యూలైన్ నిలిపి వేసి బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణ భక్తులను ఆలయంలోకి వదులుతున్నారు. ఈ సమయంలో ఆలయ ప్రవేశానికి వేర్వేరు దారులు లేక భక్తుల నడుమ తోపులాటలు, వాగ్వాదాలతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకరిపై ఒకరు పడుతుండటంతో అతి పవిత్రంగా భావించే నూనె, ఒడి బియ్యం తదితరాలు ఒంటిపై, కింద పడిపోతున్నాయి. ఇదిలా ఉండగా రూ.150 కౌంటర్ పక్కన కోతుల మల, మూత్ర విసర్జన శుభ్రం చేసినా దుర్గంధం వస్తోంది.

ఒకే క్యూలైన్ గుండా ఒకేసారి భక్తులను పంపుతుండటంతో ఆ ప్రదేశమంతా భక్తులతో కిక్కిరిసిపోతోంది. పోటీ తట్టుకోలేక కొంతమంది కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు దక్షిణ ప్రాకార మండపంలో వేచి ఉంటున్నారు. భక్తుల ఇబ్బందులను గమనిస్తున్న ఇక్కడి అధికారులు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేయడం లేదు.

సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం



భక్తులకు కలుగుతున్న అసౌకర్యాన్ని ఈవో దృష్టికి తీసుకెళ్లి ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం. ఆలయ అధికారుల సూచనలతో క్యూలైన్ ఏర్పాటు చేస్తాం. బ్రేక్ దర్శనం భక్తులను రూ.150 ప్రత్యేక దర్శన క్యూలైన్‌లో నిలిపివేస్తున్నాం. అదే క్యూలైన్ ద్వారా బ్రేక్ దర్శనం భక్తులను ఇప్పటికే అనుమతిస్తున్నాం.కల్యాణ భక్తులు తూర్పు రాజగోపురం ఎదురు నుంచి వదిలి ద్వారం దాటగానే దక్షిణంవైపు మళ్లిస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

- జిల్లెల దయాకర్‌రెడ్డి, సివిల్ ఈఈ, యాదగిరిగుట్ట

సులువైన మార్గం

ప్రస్తుతం బ్రేక్ దర్శనం భక్తులను రూ.150 క్యూలైన్ నుంచే అనుమతించినప్పటికీ అప్పటి కే ధర్మదర్శనం క్యూలైన్ భక్తులను నిలిపివేస్తారు. ఆ సమయంలో తూర్పు రాజగోపురం ద్వారా ధర్మదర్శనం క్యూలైన్ నుంచి కల్యాణ భక్తులను అనుమతిస్తే వారు ఆలయ దక్షిణ భాగం నుంచి అంతర్ తిరువీధిలో కల్యాణ మండపానికి చేరుకుంటారు. నేరుగా తూర్పు రాజగోపురం నుంచి ప్రత్యేక (రూ. 150) దర్శన క్యూలైన్ లేక ఉత్తర ద్వారం ద్వారా బ్రేక్ దర్శ నం భక్తులను అనుమతించేందుకు అధికారు లు పునరాలోచన చేయాల్సి అవసరం ఉంది. అధికారులు ఒకే క్యూలైన్ ద్వారా అనేక మంది భక్తులు పంపే ప్రక్రియకు స్వస్తి పలికి సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

పత్తి రైతును

వెంటాడుతున్న బీజీ-3

(5వపేజీ తరువాయి)

విక్రయిస్తుండటంతో వర్షాధారంగా పత్తి సాగుచేసే రైతులు వీటిని అధికంగా కొనుగోలు చేస్తున్నారు. ఆథరైజ్డ్ విత్తనాలు 450 గ్రాముల ప్యాకెట్ ధర రూ.901 ఉంటే, ఈ లూజ్ విత్తనాలు రూ.500, రూ.600కే లభిస్తున్నాయి. విత్తనాల కంపెనీల ఆధ్వర్యంలో పండించే సీడ్ పత్తిని ప్రాసెసింగ్ చేసిన తర్వాత వచ్చిన విత్తనాలను జర్మినేషన్ టెస్ట్ చేసి ఆతర్వాత ఆ టెస్ట్‌లో ఫెయిల్ అయిన విత్తనాలనే లూజ్‌గా బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. జర్మినేషన్ టెస్ట్‌లో 80శాతం మొలకశాతం రావాల్సి ఉంటుంది. అంతకంటే తక్కువ వచ్చిన విత్తనాలను ఫెయిల్ విత్తనాలుగా ప్రకటించి పక్కనపెడతారు. వాస్తవంగా ఆయా కంపెనీలు సంబంధిత సీడ్‌ను పత్తి రైతులకు అప్పగిస్తే, వారు వాటిని పశువుల దాణాకు లేదా, వ్యవసాయాధికారుల సమక్షంలో కాల్చిబూడిద చేయాలి. అయితే విత్తన కంపెనీలు రైతులకు ఎంతోకొంత ముట్టజెప్పి, ఆ విత్తనాలను తక్కువ ధర పేరుతో బ్లాక్‌లో లూజ్ విత్తనాల పేరుతో విక్రయిస్తున్నాయి. ఈ విత్తనాలతో సాగయ్యే పత్తి మొక్కలకు ఎదుగుదల తక్కువగా ఉండడంతో పాటు, దిగుబడి సైతం నాణ్యమైన విత్తనాల కంటే తక్కువగా ఉంటుంది. అయితే రైతులు వర్షాధారంగా, మెట్ట ప్రాంతాల్లో వీటిని సాగుచేస్తుండడంతో ఒక్కో పాదులో నాలుగైదు విత్తనాలను నాటడంతో పాటు, పంట దిగుబడి తక్కువ వచ్చినా వర్షాలు లేకపోవడం, వాతావరణ ప్రతికూలతలు, లేక దోమపోటు, తెగుళ్ల బెడదవల్లనో దిగుబడి తగ్గిందని వ్యవసాయాధికారులు, రైతులు సర్దిచెప్పుకుంటున్న పరిస్థితి ఉండటంతో ఈ విత్తనాలను అరికట్టలేని దుస్థితి నెలకొంది.

నకిలీలు, నాసిరకం విక్రయిస్తే కఠిన చర్యలు



బీజీ-3 విత్తనాలు రైతులు సాగుచేయకూడదు. ఇవి విషపూరితమే కాకుండా భూసారాన్ని క్షీణింపజేస్తాయి. ఈ విత్తనాలకు అనుమతిలేదు. అదేవిధంగా లూజ్ విత్తనాలను సైతం రైతు లు కొనుగోలుచేయవద్దు. ప్రభుత్వం ధ్రువీకరించిన కంపెనీలకు చెందిన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలి. డీలర్ల వద్ద బ్యాచ్ నెంబర్లు, కంపెనీ వివరాలు, తయారీ తేదీ వివరాలను నమోదు చేసిన బిల్లులు తప్పకుండా పొందాలి. బీజీ-3 పేరుతో గానీ, లూజ్ విత్తనాల పేరుతో గానీ ఎవరైనా డీలర్లు లేదా ఇతరులు విత్తనాలు విక్రయిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటాం. ఇలాంటి విక్రయాలు జరిగితే మా దృష్టికిగానీ, మండల వ్యవసాయాధికారులు, ఏఈవోల దృష్టిగానీ తీసుకురావాలి. జిల్లా వ్యాప్తంగా నకిలీ విత్తనాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశాం.

- పి.శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్లగొండ

పోచంపల్లి

చేనేత ఇక్కత్ పరిశ్రమను పరిరక్షించాలి

● కేంద్రమంత్రి జితన్ రామ్‌మాన్‌జీ నికోరిన భారత లవకుమార్



కేంద్రమంత్రిని సన్మానిస్తున్న పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్

భూదాన్‌పోచంపల్లి, మే 26 (ఆం ధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి చేనేత టై అండ్ డై ఇక్కత్ ప రిశ్రమను పరిరక్షించాలని పోచంపల్లి చేనేత టైఅండ్‌డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్ కోరారు. హైదారాబాద్‌లోని భారత ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ - నిమ్స్‌మి కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమానికి కేంద్రమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా భారత లవకుమార్ ఇక్కత్ సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కత్ పట్టుచీరల డిజైన్లను బడా పారిశ్రామిక కంపెనీలు, పవర్‌లూమ్ పరిశ్రమ య జమానులు ప్రింట్ చేసి డూప్లికేషన్ చేయడంతో పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకుపోతుందని ఆవేదన వ్యక్తం చేశా రు. డిజైన్లను కాపీ చేస్తున్నారని ఆరోపించారు. జీఐపీ గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ డిజైన్ల డూప్లికేషన్‌ను నివారించేందుకు తక్షణ చర్యలు చేపట్టి, పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమను పరిరక్షించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని లవకుమార్ తెలిపారు.

గోపలాయపల్లి ఆలయాన్ని సందర్శించిన ఆర్టీఐ కమిషనర్



కమిషనర్ పీవీ శ్రీనివాస్ దంపతులకు సన్మానం

నార్కట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానాన్ని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ పీవీ శ్రీనివాస్ ఆదివారం రాత్రి సందర్శించారు. కుటుంబసభ్యులతో కలిసి దేవస్థానానికి వచ్చిన ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మూలవిరాట్ వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కమిషనర్ దంపతులను అర్చకులు ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం గుట్టపై ఉన్న ఇతర ఉపాలయాలను సందర్శించారు.

సాగు సందడి

- తొలకరికే మొదలైన సాగు పనులు
- పత్తి సాగు మొదలు పెట్టిన రైతులు



పత్తి సాగుకు దుక్కులు సిద్ధం చేస్తున్న రైతులు

మర్రిగూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్తెలు ప్రారంభం కాక ముందే ఈ ఏడాది రుతుపవనాలు ముందుగా రావడంతో తొలకరి వర్షాలు పలకరించాయి. దీంతో రైతులు వ్యవసాయ సాగులో నిమగ్నమయ్యారు. మండలంలో అడపాదడప వర్షాలు కురిశాయి. ఆ వర్షాలకు పలువురు రైతులు దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నారు. వర్షాలు కురియడం వల్ల మెట్ట పంటలైన పత్తి సాగు వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు. సిద్ధంగా ఉన్న భూముల్లో పత్తి విత్తనా లు విత్తుతున్నారు. అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఈ కత్తెర చివరి నుంచే వర్షాలు కురుస్తున్నాయి. వర్షాలు పెరగడానికి రో హిణి, మృగశిర, ఆరుద్ర కార్తెలు బలమైనవి. దీనిని దృష్టి లో పెట్టుకుని రైతులు ముందస్తుగానే దుక్కులు దున్నుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచే రోహిణి కార్తె ప్రారంభమైంది. ఈ కార్తెలో కాలం కలిసి వస్తే బలమైన వర్షాలు కురిస్తే పంటలు వేసిన దిగుబడి కూడా ఎక్కువ వస్తుందని రైతుల నమ్మకం. నల్లగొండ మర్రిగూడ మండలంలో గతేడాది 28,184 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ప్రస్తుతం వరి సాగుపై రైతులు దృష్టి సారించడం లేదు. ఈ ఏడాది వర్షాకాలం సీజన్‌లో 28,884 ఎకరాల వరకు పత్తిసాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ అధికారి సహాస్ పేర్కొన్నారు.

గుట్టలో శివకేశవులకు విశేషపూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట మే 26 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి కొండపై సోమవారం శివకేశవులకు విశేషపూజలు కొనసాగాయి. స్వయంభూ స్వామి, అమ్మవార్ల శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, శ్రీ పర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామివారి శివాలయంలో స్పటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో మూలవర్తులను పంచామృతాలతో అభిషేకించి, తులసీదళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తుల వద్ద విష్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు కొనసాగాయి. శివాలయంలోని ముఖమండపంలో స్పటిక మూర్తులను పంచామృతాలతో అభిషేకించారు. శివపార్వతుల ఉత్సవమూర్తులను అలంకరించి తిరువీధుల్లో ఊరేగించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 20,07,544 ఆదాయం సమకూరినట్లు ఈవో వెంకట్రావు తెలిపారు.

మట్టపల్లిలో నృసింహుడి కల్యాణం

మఠంపల్లి: రెండో యాదగిరిగుట్టగా పేరుగాంచిన మట్టపల్లి శ్రీలక్ష్మీ నృసింహుని క్షేత్రంలో సోమవారం స్వామివారి నిత్య కల్యాణాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, చెన్నూరి విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు తూమాటి శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, కృష్ణమాచార్యులు, రామాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, సీతారామశాస్త్రి, శేషగిరిరావు, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

జాతీయస్థాయి సబ్ జూనియర్

నెట్‌బాల్ పోటీలకు సాత్విక్ ఎంపిక



సాత్విక్

హాలియా, మే 26 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ నెల 28, 29,30 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్‌బాల్ పోటీలకు హాలియాలోని లక్ష్య స్కూల్‌కు చెందిన విద్యార్థి ఎన్.సాత్విక్ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను చదువులకే కాకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించాలని అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థి సాత్విక్‌ను పాఠశాల డైరెక్టర్ నాగెండ్ల విజయభాస్కర్‌రెడ్డి, నర్వనేని సతీష్, హెచ్‌ఎం అనుముల శ్రీనివాస్, పీఈటీ రవి అభినందించారు.

మట్టపల్లి వంతెనపై నీరు

● ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మట్టపల్లి కృష్ణానదిపై ఏర్పాటు చేసిన బ్రిడ్జిపై నిలిచిన వర్షపునీరు

మఠంపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ సమీపంలోని కృష్ణానదిపై ఏర్పాటు చేసిన హైలెవల్ వంతెనపై వర్షపునీరు నిలిచిపోవడంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. ఉభయ రాష్ట్రాలను కలుపుతూ మట్టపల్లి వద్ద నిర్మించిన వంతెనపై రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగులోతు నీరు నిలిచింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల క్రితం ఈ వంతెనను నిర్మించగా అప్పట్లో వర్షపు నీరు కృష్ణానదిలోకి వెళ్లేలా అక్కడక్కడా పైపులు ఏర్పాటు చేశారు. వాహనాలు రద్దీ పెరగడం, దుమ్ము, మట్టితో అవి పూర్తిగా పూడిపోయాయి. దీంతో వర్షపు నీరు వంతెనపైనే నీరు నిల్వ ఉంటోంది. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో పాదచారులపై మురుగునీరు పడి దుస్తులు తడిసిపోతున్నాయి. రోజుల తరబడి నీరు అలానే ఉండటంతో సీసీ చేసిన వంతెనపై కంకరతేలి గుంతలు పడుతున్నాయి. లారీలు, బస్సుల రా కపోకలతో గుంతలు పెద్దగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు పైపుల్లో మట్టి తొలగించి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్ర యాణికులు కోరుతున్నారు. ఈ విషయమై ఏఈ శివకుమార్ మాట్లాడు తూ సిబ్బందిని పంపి పైపుల్లో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తామని, నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమాజానికి కమ్యూనిస్టులు అవసరం

● ఎర్ర జెండా పార్టీలన్నీ ఏకమవ్వాలి ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాంబశివరావు చిత్రంలో పల్లా వెంకట్‌రెడ్డి, నెల్లికంటి సత్యం

చౌటుప్పల్ మే 26 (ఆంధ్రజ్యోతి): సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇందుకోసం ఎర్రజెండా పార్టీలన్నీ ఏకం కావాలని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఓ ప్రైవేటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సాంబశివరావు మాట్లాడారు. కమ్యూనిస్టులపై రాక్షస నిరంకుశ పాలనను మతోన్మాద బీజేపీ కొనసాగిస్తోందని, దీనిని నిలువరించేందుకు ఎర్ర జెండా వామపక్ష పార్టీలన్నీ ఏక తాటిపైకి వచ్చి ప్రజా పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని ఆయన కోరారు. ప్రతి గ్రామంలో, ప్రతి గూడెంలో వందేళ్ల సీపీఐ చరిత్రను అమరుల త్యాగాలను, పోరాట ఘట్టాలను గుర్తుచేస్తూ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఆగస్టు 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మేడ్చల్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని, సెప్టెంబరు 18వ తేదీ నుంచి 23వ తేదీన వరకు చండీగఢ్‌లో జాతీయ మహాసభలు జరుగుతాయని ఆయన తెలిపారు. ఆదివాసీలను, మావోయిస్టులను చట్టవిరుద్ధంగా హత్యలు చేయడాని ఖండిస్తున్నామని, ఇవ్వన్నీ బీజేపీచేసిన హత్యలేనని ఆయన అన్నారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా ఎన్‌కౌంటర్లు చేయడం అప్రజాస్వామికమని అన్నారు. వామపక్ష భావజాలాన్ని, మావోయిస్టులను అంతం చేయడం లక్ష్యంగా బీజేపీ నేతృత్వంలో ఎన్డీఏ ప్రభుత్వం, ప్రధాని మోదీ, అమిత్‌షా ఆపరేషన్ కగార్‌ను చేపట్టి మావోయిస్టులను విచ్చలవిడిగా బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని ఆయన కుటుంబ సభ్యులు అందజేయాలని ఆయన కోరారు. .ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యుడు కే.శ్రీనివాస్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య, సీపీఐ మండల కార్యదర్శి పల్లె శేఖర్‌రెడ్డి, పగిళ్ల మోహన్‌రెడ్డి, కలకొండ సంజీవ, ఉడత రామలింగం, ఎస్‌ఏ రెహమాన్, టంగుటూరి రాములు, కొండూరు వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలి

మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండటౌన్, సూర్యాపేట టౌన్, నేరేడుచర్ల, హుజూర్‌నగర్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను ప్రజలే కాపాడుకోవాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. తెలంగాణ పౌర స్పందన వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు నిర్వహించే ప్రచార జాతను సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్ నుంచి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల బలోపేత ప్రచారజాత వాహనాన్ని అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రారంభించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల, హుజూర్‌నగర్‌కు చేరిన ప్రచారజాతాలో అలుగుబెల్లి నర్సిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అభివృద్ధి చెందిన దేశాల్లో విద్యారంగం 90శాతానికి పైగా ప్రభుత్వ ఆధీనంలో ఉంటే, మన రాష్ట్రంలో కేవలం 40 శాతం మాత్రమే ప్రభుత్వ ఆధీనంలో ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డు ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి ఛైర్మన్, ముగ్గురు సభ్యులతో నియమించిన తెలంగాణ విద్యా కమిషన్ రిపోర్టు సూచించిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం విద్య అభివృద్ధి కోసం కేంద్ర బడ్జెట్‌లో విద్యకు 10శాతం నిధులు కేటాయించాలన్నారు. ఉపాధ్యాయులు ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వాయి అంజిరెడ్డి, సూర్యాపేట అధ్యక్షుడు ధనమూర్తి, మంగ, నాగమణి, బక్క శ్రీనివాసాచారి, పెరుమాళ్ళ వెంకటేశం, జగదీష్ చంద్ర, శ్యాంసుందర్, మహేష్, దండ భాస్కర్‌రెడ్డి, గోపాలకిషన్, ఎన్.సోమయ్య, యాకయ్య, అరుణభారతి, ఆడం, చిలక రమేష్, లాలు, శ్రీను, ధనమూర్తి, భిక్షపతి, శంకరి క్రాంతికుమార్, అనిల్‌కుమార్, మంగ, సాంబయ్య, నాగండ్ల నర్సింహారావు, జిలకర రామస్వామి, నాగేశ్వరావు, అక్కయ్యబాబు, శ్రీనయ్య, రవీందర్‌రెడ్డి, సైదానాయక్ వెంకటరెడ్డి, పల్లె వెంకటరెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు, చిక్కుళ్ల గోవింద్ తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో బస్సు యాత్రను ప్రారంభిస్తున్న నాయకులు, మాజీ ఎమ్మెల్సీ

'ఉపాధి' పథకాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్రం



వేములపల్లిలో ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

వేములపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఉపాధిహామికి సరైన నిధులు కేటాయించకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 'ఉపాధి' పని ప్రదేశాన్ని ఆయన పరిశీలించి కూలీలతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. గత యూపీఏ ప్రభుత్వం ఉన్నప్పుడు బడ్జెట్‌లో 4శాతం నిదులు కేటాయించేదని, బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత 1.3శాతం నిధులను కేటాయిస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం 1.19కోట్ల మంది ఉపాది పనులకై జాబ్ కార్డులకు అప్లయ్ చేసుకోగా వాటిలో కేవలం 50లక్షల మందికి మాత్రమే జాబ్‌కార్డులను మంజూరు చేయడం బాధాకరమన్నారు. ప్రస్తుతం ఉపాది హామి పథకంలో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కుదించి ఉదయం వేళల్లో మాత్రమే కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డబ్బికార్ మల్లేష్, మల్లు గౌతంరెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, పాదూరి గోవర్ధని, చల్లబొట్ల ప్రణీత్‌రెడ్డి, సైదులు, భిక్షం, సుకన్య, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ****

నల్లగొండ
నకిరేకల్, మునుగోడు

తహసీల్దార్‌కు సన్మానం

మర్రిగూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జక్కర్తి శ్రీనివాస్‌కు, డీటీ చంద్రశేఖర్‌కు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీలర్ల సంఘం నాయకులు శాలువాలతో సన్మానించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రవణ్, శంకర్, అలివేలు, ప్రవీణ్, రాణి, రామలింగం, రాములు, పద్మ, మహేందర్, పలువురు డీలర్లు పాల్గొన్నారు.

సేంద్రీయ విధానంతో అధిక దిగుబడులు : ఏడీఏ

మునుగోడు, మే 26 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో సేంద్రీయ విధానంతో రైతులు అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ వేణుగోపాల్ అన్నారు. పట్టణంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సేంద్రీయ విధానం వల్ల ఆదాయంతో ఆరోగ్యం లభిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో ఎంఏవో పద్మజ, ఏఈవోలు, ఎఫ్‌పీవో ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

సమాచారం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గట్టుప్పల్, మే 26 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బండారి రాములు అన్నారు. సోమవారం మండల పరిధిలోని తేరట్‌పల్లి, కమ్మగూడెం గ్రామాల్లో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దపీట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు బండారు అంజి, పగిళ్ల కోటి, చిలుకూరి వెంకటేశం, బరిగెల ధర్మయ్య, అశోక్, శేఖర్, ప్రసాద్, శ్రీను, మాదవ్, శేఖర్, లబ్ధిదారులు వరికుప్పల యాదయ్య, పప్పు పాపమ్మ, బొడ్డుపల్లి సైదులు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు చెక్కుల అందజేత

మర్రిగూడ: మండలంలోని దామెరభీమనపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను గ్రామ మాజీ సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు గోడేటి నరసింహ అందజేశారు. కార్యక్రమంలో మునగాల జగాల్‌రెడ్డి, చిలువేరు శంకర్, జిల్లా శంకర్, చిలువేరు రమేష్, మలిగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నక్క తిరుపతయ్య, శేఖర్‌గుప్తా, నరేష్, వెంకటయ్య, కృష్ణయ్య, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

లైన్‌మన్ పోస్టులను భర్తీ చేయాలి

చండూరు, మే 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న జూనియర్ లైన్‌మన్ పోస్టులను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటయ్య అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో చండూరులో ఏర్పాటు చేసిన సంఘం జెండాను సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఏ రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా నిరంతరం విద్యుత్ కార్మికుల సమస్యలపై పోరాడే ఏకైక యూనియన్ తమదేనన్నారు. విద్యుత్ సంస్థలో కార్మికులు 24 గంటలు కష్టపడి పనిచేస్తూ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నారని అన్నారు. ఆర్టిజన్ కార్మికులకు గ్రేడ్‌ల వారీగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి టి.శ్రీనివాసులు, అధ్యక్షుడు రాంబాబు, ఆర్.బాలునాయక్, ఆయూబ్, ముత్తయ్య, ఎండి. షరీఫ్‌పాషా, షజ్జుపాషా, ఎల్లేశం, ముత్యంరెడ్డి, దోటి శ్రీను, చంద్రమౌళి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కార్యాలయానికి స్థలం కేటాయించాలి

నల్లగొండటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధుల బృందం కోరింది. సోమవారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ 2008 లో బిల్డర్ అసోసియేషన్ ఏర్పాటు చేశామని, అప్పట్లో అసోసియేషన్ కార్యాలయానికి ఎస్ఎల్‌బీసీలోని ఈఈ-4 క్వార్టర్స్‌ను కేటాయించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ బిల్డింగ్ మెడికల్ కళాశాల భవనానికి పోతున్నందున నూతన భవన నిర్మాణం కోసం వెయ్యి గజాల స్థలాన్ని ఇప్పించాలని కోరారు. స్థలం కేటాయింపునకు ప్రభుత్వం నిర్ణయించిన ధరను తాము చెల్లిస్తామని తెలిపారు. తమ కార్యాలయ కార్యకలాపాలు నిర్వహించుకోవడమే కాకుండా స్కిల్ డెవలప్‌మెంట్ వంటి సామాజిక సేవా కార్యక్రమాలను కూడా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ డీవీఎన్ రెడ్డి, మాజీ చైర్మన్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలి



సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తున్న సత్యనారాయణ

నల్లగొండటౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో బురదమయంగా ఉన్న ప్రధానమైన రోడ్లను సిమెంట్ రోడ్లుగా నిర్మాణం చేయాలని మాజీ మునిసిపల్ కౌన్సిలర్ కొండూరు సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయన కలెక్టర్‌ను కలిసి 19వార్డులో నెలకొన్న సమస్యల గురించి వివరించారు. కాలనీలో ప్రధానమైన రోడ్లను సిమెంట్ రోడ్లుగా వెంటనే నిర్మాణం చేయించాలని కోరారు. అంతేకాకుండా శ్రీనగర్‌కాలనీ, దీపక్ నగర్, ఎన్జీవోస్ కాలనీ, ఆదిత్య కాలనీల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో 19వ వార్డు కాలనీవాసులు ఎం.కిషన్, ఎం.దశరథ, యాకాల వెంకన్న, నిమ్మనగోటి శ్రీను, జంపాల గిరి, గిరి, కవిత, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఒక్కొక్కరిది ఒక్కో గాథ

న్యాయం చేయాలని ఒకరు... ఇల్లు మంజూరు చేయాలని మరొకరు... అక్రమాలను అడ్డుకోవాలని ఇంకొకరు... తమకు వారసత్వ భూములను ఇప్పించాలని.... ఇబ్బందులు పరిష్కరించాలని మరికొందరు.. ఇలా రకరకాల సమస్యలతో జిల్లా నలుమూలల నుంచి అనేకమంది బాధితులు ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి వారంవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి హాజరయ్యారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీనివాసులు బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వాటిలో కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించగా మరికొన్నిటి సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు లేఖలు రాశారు.
- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ టౌన్)



గ్రీవెన్స్ డే లో బాధితుల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణఅమిత్

- 'ప్రజావాణి'కి వినతుల వెల్లువ
- సమస్యల పరిష్కారానికి తరలి వస్తున్న బాధితులు

మా వాటా మాకు ఇప్పించండి



మాకు మా గ్రామంలో వంశపారపర్యంగా వేల ఎకరాల భూమి వస్తుంది. ఆ భూమంతా మా తాత పేరిట ఉండేది. మా నాన్నతో పాటు ఆయనకు నలుగు సోదరులు కూడా ఉన్నారు. అయితే పెద్దవాడైన మా నాన్న మా చిన్నతనంలో నే చనిపోవడంతో అమ్మ చదువుల నిమిత్తం మమ్మల్ని నల్లగొండకు తీసుకువచ్చింది. అప్పటి నుంచి మేము పెద్ద వాళ్లం అయ్యేంతవరకు కూడా వారసత్వ సంపద అంతా కూ డా మా తాత పేరు మీదనే ఉండేది. కొంత కాలం క్రితం తాత కాలం చేయడంతో నలుగురు బాబాయిలు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై మాకు భూమి దక్కకుండా వాళ్ల పేరిట ఆర్ఓఆర్ పట్టా చేయించుకున్నారు. ఇది తెలియని మేము ఇంతకాలం తమకు కూడా భూమిలో వాటా వస్తుందని అనుకున్నాం. తీరా ఇప్పుడు వెళ్లి చూస్తే తమకు వాటా లేదంటూ దబాయిస్తున్నారు. వారసులం ఉన్నా కూడా తమకు భూమిలో వాటా ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి పాల్పడటమే కాకుండా దిక్కున్నచోట చెప్పుకోండని అంటూ బెదిరిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారు. దయచేసి దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి తాత ఆస్తిలో తమకు తమ వాటా ఇప్పించి న్యాయం చేయండి.
- తండు శ్రావణి, తిప్పర్తి

అవస్థలు తీర్చండి



మేమంతా పట్టణంలోని నాలుగో వార్డు కేశరాజుపల్లికి చెందిన పెన్షన్‌దారులము. గ్రామంలోనే పోస్టాఫీస్ ఉన్నా మాకు ఆ పోస్టాఫీస్‌లో కాకుండా పట్టణంలోని రామగిరి పోస్టాఫీస్‌లో పింఛన్ ఇస్తున్నారు. దీంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నాం. ప్రతీ నెలా పింఛన్ కోసం ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పట్టణంలోని రామగిరికి వెళ్లాల్సి వస్తుంది. తమ పరిస్థితిని అర్థం చేసుకొని కేశరాజుపల్లిలో ఉన్న పోస్టాఫీస్‌కు తమ పింఛన్‌ను ట్రాన్స్‌ఫర్ చేయాలని కోరారు.
- పెన్షన్ దారులు, కేశరాజపల్లి, నల్లగొండ

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండి



నేను నిరుపేద కుటుంబానికి చెందిన వాడను. నేను మా ఊరిలో చిన్న రేకుల ఇంట్లో ఉంటూ జీవనం కొనసాగిస్తున్నాను. నేను ఇప్పటివరకు కూడా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థికంగా లబ్ధి పొందలేదు. మాకు ఎలాంటి స్థిర చర ఆస్తులు కూడా లేవు. ఇటీవల ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు సర్వే సైతం పూర్తి చేశారు. కానీ ప్రస్తుతం విడుదల చేసిన జాబితాలో నా పేరు లేదు. ఇదేంటంటే ప్రశ్నిస్తే నీకు ఇంటి జాగా లేదని సమాధానం ఇస్తున్నారు. ఇంటి స్థలం లేనప్పుడు ప్రస్తుతం నేను ఉంటున్న ఇల్లు ఎవరిదని ప్రశ్నిస్తూ అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను కూడా అధికారులకు సమర్పించాను. అయినా ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దయచేసి నాకు ఇందిరమ్మ ఇంటిని కేటాయించి న్యాయం చేయాలి.
- సతీష్ , కేశరాజుపల్లి, నల్లగొండ

అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా



నాకు మా గ్రామంలో సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని నా తండ్రి పసుపు కుంకుమ కింద నా పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. అయితే తన భూమిపై కన్నేసిన తమ కుటుంబానికి చెందిన కొంతమంది దొంగ సంతకాలతో వారి పేర్ల మీద పట్టా చేయించుకున్నారు. ఈ విషయాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అక్కడ ఎవరూ కూడా పట్టించుకోవడం లేదు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు లెక్క చేయడం లేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలి.
- యాస లక్ష్మమ్మ, కాపరాయిపల్లి, మోత్కూరు

బిల్లు ఇప్పించండి



నేను ఒక చిన్న కాంట్రాక్టరుని. చండూరు మునిసిపాలిటీలోని మూడో వార్డులో బీసీ కమ్యూనిటీ హాల్‌ను రెండేళ్ల క్రితం నిర్మాణం చేపట్టాను. సుమారు రూ. 5లక్షల వ్యయంతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేసి ఎంబీ రికార్డింగ్ కూడా పూర్తి చేశాను. అయినా ఇంతవరకు బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాను. దీనిపై గడిచిన 16 నెలల కాలంలో అనేక మంది ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. డీఎంఎఫ్టీ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలి...
- స్వామికుమార్, చండూరు

జననీయాత్రను సద్వినియోగం చేసుకోవాలి

● కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేని దంపతులకు అధునాతన సంతాన సౌకర్య పరిష్కారాల కోసం ఓయాసిస్ ఫర్టిలిటీ ఆధ్వర్యంలో నల్లగొండలో జననీ యాత్ర చేపట్టడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎన్జీ కళాశాల ఆవరణలో మాజీ మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మాజీ కౌన్సిలర్ ఖయ్యూంబేగ్‌లతో కలిసి జననీ యాత్రను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మనకు ఉన్న సమస్యలు లోపం కాదని, ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని తెలిపారు. పిల్లలు పుట్టని దంపతులను బయటి వారితో పాటు కుటుంబ సభ్యులు కూడా వేధిస్తారని, అవమాన పరుస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ దగ్గరికి వెళ్తే లోపాన్ని గుర్తించి మీ కలలను సహకారం చేసుకోవచ్చని సూచించారు. అమ్మానాన్న అవ్వాలని పిల్లలు పుట్టని దంపతుల కోసం నల్లగొండలో జననీయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు ఎంతో మానసిక వేదనకు గురవుతారని పేర్కొన్నారు. ఓయాసిస్ ఫర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సాయి మానస దార్ల మాట్లాడుతూ సంతానలేమి అనేది ఒక వైద్యపరమైన అంశం మాత్రమే కాదని, పెరిగిపోతున్న జీవనశైలి, ఆందోళన కూడా ఒక కారణమేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



జననీయాత్రను ప్రారంభిస్తున్న గుమ్ముల మోహన్‌రెడ్డి, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి : కరెంట్‌రావు

నల్లగొండ టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో పనిచేస్తున్న కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఏకైక సంఘం తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్‌వీకేఎస్)మని ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ కంపెనీ ప్రెసిడెంట్ పి.కరెంట్‌రావు అన్నారు. మేడే ఉత్సవాలను పురస్కరించుకొని జిల్లా సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం యూనియన్ జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించి రాష్ట్ర అవతరణ అనంతరం కార్మికుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు మెరుగైన పీఆర్‌ఎస్‌లో పాటు కాంట్రాక్టు కార్మికులకు సంస్థ ద్వారానే వేతనాలు వచ్చేలా ఆర్టిజన్‌లుగా గుర్తించడం జరిగిందన్నారు. ఇది కేవలం టీఆర్‌వీకేవీ కృషి ఫలితంగా సాధ్యమైందని అన్నారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్లను జూనియర్ లైన్‌మన్‌గా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా 2004 వరకు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరికీపి పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. టీఆర్‌వీకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జేఏవో పొట్టబత్తుల శ్రీనివాస్, జిల్లా గౌరవ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యదర్శి జంజిరాల వెంకన్న, డివిజన్ కార్యదర్శి గండమల్ల రాములు, నాయకులు మైనం ఊశయ్య, ముక్తార్ మొయినుద్దీన్, వెంకటేశ్వర్లు, సైదులు, శీను, మారయ్య, రాము, నవీన్‌కుమార్, సుధాకర్, నర్సిరెడ్డి, యాదయ్య, ఉమామహేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న కరెంట్‌రావు

మమ్మల్ని నమ్మండి.. మంచి విద్యను బోధిస్తాం

- విద్యార్థుల తల్లిదండ్రులతో టీచర్లు
- ప్రైవేట్ పాఠశాలలకు పంపొద్దని హితవు

నార్కట్‌పల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): ప్లీజ్ మమ్మల్ని నమ్మండి...మీ పిల్లలకు మంచి విద్యను బోధిస్తాం... వారిని క్రమశిక్షణ గల విద్యార్థులుగా తీర్చిదిద్దుతామని నార్కట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు హామీ ఇస్తున్నారు. హెచ్‌ఎం రాములు మార్గదర్శకత్వంలో టీచర్లు మూడు బృందాలుగా ఏర్పడి పాఠశాలలో అడ్మిషన్ల కోసం విద్యార్థుల ఇంటి బాట పట్టారు. ప్రధానంగా ప్రైవేట్ పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్న తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో చదివించడం ద్వారా సమకూరుతున్న ప్రయోజనాలు, అందుబాటులో ఉన్న వనరుల గురించి వివరిస్తూ కరపత్రం పంపిణీ చేశారు. ఒక వేళ మార్పు తీసుకు రాలేకపోతే వచ్చే ఏడాది మా స్కూల్‌లో వారిని చదివించమని మేం మిమ్మల్ని ఒత్తిడి చేయమని నచ్చచెబుతూ హామీ ఇస్తున్నారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి

చిట్యాలరూరల్: బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని నేరడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వల్లపు నాగరాజు అన్నారు. చిట్యాల మండలం నేరడలో సోమవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడేళ్ల వరకు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు, ఐదేళ్లు వచ్చిన పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తే ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ఇంటివద్ద ఉంచవద్దని పాఠశాలకు పంపించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, ఉపాధ్యాయుడు లింగస్వామి, ముశం శ్రీను, బత్తుల చందు, కడారి గోపాల్, సుజాత, అలివేలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లిదండ్రులకు కరపత్రాన్ని అందజేస్తున్న ఉపాధ్యాయులు

'ఆపరేషన్ సిందూర్'తో కాళ్లబేరం



నకిరేకల్‌లో నిర్వహించిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు

నకిరేకల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో భారత్ నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌తో తట్టుకోలేక పాకిస్థాన్ కాళ్ల బేరానికి వచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయోత్సవాన్ని హర్షిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం నకిరేకల్ పట్టణంలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. పహల్గాంకు వెళ్లిన పర్యాటకులను పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు కిరాతకంగా, అన్యాయంగా చంపారని అన్నారు. ఉగ్రవాదులను అంతమొందించేందుకే భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నకిరేకంటి మొగిలయ్య, బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి గోలి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, నాయకులు గర్రె మురళి మోహన్, బుడిగె సైదులు, పిట్టల వెంకట్, యానాల శంకర్‌రెడ్డి, యానాల శ్రీనివాస్‌రెడ్డి, గుడుగుంట్ల సాయన్న తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీకే విత్తనాలు విక్రయించాలి: ఏవో

నార్కట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, విత్తనాలు ఇతర రసాయన సంహారక మందులు ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరకే విక్రయించాలని ఏవో గౌతమ్ సూచించారు. నార్కట్‌పల్లిలోని ఎరువుల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రైతులు కూడా ప్రభుత్వం గుర్తించిన డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. డీలర్లు కూడా రైతులకు తప్పనిసరిగా రశీదులు ఇవ్వాలని, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నట్లు రుజువైతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నెమ్మాని మాజీసర్పంచ్ గంట్ల నర్సిరెడ్డి మృతి





నర్సిరెడ్డి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మంత్రి కేవీఆర్

నార్కట్‌పల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలం నెమ్మాని గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు గంట్ల నర్సిరెడ్డి సోమవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. గంట్ల నర్సిరెడ్డి సర్పంచ్‌గా, నీటి సంఘం చైర్మన్‌గా పనిచేశార. విషయం తెలుసుకున్న గ్రామానికి చేరుకొని మంత్రి వెంకట్‌రెడ్డి గంట్ల మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా ఎమ్మెల్యే వేముల వీరేశం, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మల్గ బాలకృష్ణ, అలుగుబెల్లి రవీందర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, పాశం శ్రీనివాస్‌రెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు నర్సిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

కష్ట జీవులకు అండగా ఎర్రజెండా



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు


మునుగోడు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): కష్టజీవులకు అండగా ఎర్రజెండా ఉంటుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురజా రామచంద్రం అన్నారు. మండలంలోని కొంపల్లి గ్రామంలో సోమవారం సీపీఐ మండల మహాసభ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వాలు మారినా పేదవాడి బతుకులు మారలేదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 29వ తేదీన సింగారం గ్రామంలో జరిగే సీపీఐ మునుగోడు మండల మహాసభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొలుగూరి నరసింహ, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యులు సురిగి చలపతి, బొమ్మరబోయిన లాలు, నాయకులు ఉప్పునూతల రమేష్, వెంకటేశ్వరరావు, యాదయ్య, డోకూరు మల్లారెడ్డి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లు మంజూరైన వారు నిర్మాణాలు చేపట్టాలి



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న విజయ్‌భాస్కర్

మునుగోడు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు నిర్మాణాలు చేపట్టాలని ఇన్‌చార్జి ఎంపీడీవో విజయ్ భాస్కర్ అన్నారు. మండలంలో పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపికైన గుండ్లోరిగూడెం గ్రామంలో నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఇళ్లు మంజూరై ఇప్పటి వరకు నిర్మాణ పనులు మొదలుపెట్టని లబ్ధిదారుల ఇంటికి వెళ్లారు. త్వరగా ఇంటి నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటి వరకు బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన వారికి విడతల వారీగా ప్రతీ సోమవారం లబ్ధిదారుల ఖాతాలో బిల్లులు పడతాయని తెలిపారు. వారితో పాటు ఎంపీవో స్వరూప, గ్రామ సెక్రటరీ పుష్ప, యువజన కాంగ్రెస్ నాయకులు జంగిలి నాగరాజు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
***
ANDHRAJYOTHY

నల్లగొండ
5
మంగళవారం 27 మే 2025

అందరూ ఒక్క లైన్‌లోనే

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలోకి ప్రవేశించేందుకు ఏర్పాటుచేసిన క్యూలైన్లు భక్తులకు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ప్రత్యేక దర్శనం ప్రవేశద్వారం గుండానే ఒకే సమయంలో బ్రేక్ దర్శనం, నిత్య కల్యాణం భక్తులను ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ఆలయంలోకి అనుమతిస్తున్నారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చిన సమయంలో తోపులాట జరుగుతోంది. 7

పత్తి రైతును వెంటాడుతున్న బీజీ-3



- అధిక దిగుబడులు, తక్కువ పెట్టుబడి నెపంతో రైతుల మొగ్గు
- భూసార క్షీణత, కాలుష్యకారకమవడంతో వీటిపై నిషేధం
- కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలని పలువురి డిమాండ్

పత్తి రైతులను కల్తీభూతం వెంటాడుతోంది. నకిలీ, నాసిరకం విత్తనాల నిరోధానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ప్రభుత్వం చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అధిక దిగుబడులు, తక్కువ ధర పేరుతో నాసిరకం, కల్తీ విత్తనాలు రైతులను ముంచుతున్నాయి. వేసవి ఆరంభం నుంచే గ్రామాల్లో మాటువేసిన ఏజెంట్లు తక్కువ ధరకు, అప్పుకింద ఇస్తామని రైతులను మభ్యపెట్టి కల్తీవిత్తనాలు అంటగడుతున్న పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉంది. ప్రధానంగా పత్తిని వర్షాధార పంటగా సాగుచేసే రైతులను వీరు లక్ష్యంగా చేస్తున్నారు. ప్రభుత్వం నిషేధించిన బీజీ-3 రకం పత్తి విత్తనాలతో పాటు, లూజ్ విత్తనాలను రైతులకు అంటగడుతూ వ్యాపారులు, ఏజెంట్లు దండుకుంటుండగా, ఆ విత్తనాలు సాగుచేసిన రైతులు మాత్రం ఆశించిన దిగుబడులురాక నష్టాల పాలవుతున్నారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

భూసారం తీవ్రంగా కోల్పోవడంతో పాటు, వాతావరణ కాలుష్యానికి తీవ్రకారకంగా ఉంటుందనే శాస్త్రవేత్తల సూచనల మేరకు దేశంలో పత్తి విత్తనాల్లో బీజీ-3 రకాలను నిషేధించారు. కేవలం బీజీ-1, బీజీ-2 విత్తనాల ను మాత్రమే రైతులు సాగుచేయాలి. అయితే బీజీ-3 విత్తనాల ను అక్రమంగా ఉత్పత్తి చేస్తున్న కొన్ని సంస్థలు, వాటిని నేరుగా రైతులకు సరఫరాచేస్తున్నాయి. బీజీ-2 సాగుచేస్తే విత్తనం నాటిన 60 రోజుల తర్వాత దోమ పోటు ఉంటుందని, అదే బీజీ-3 సాగుచేస్తే పంట దిగుబడి పూర్తయ్యేంతవరకు దోమపోటుతో పాటు, పురుగుల బెడద, తెగుళ్ల తాకిడి ఉండదనే ప్రచారంతో ఈ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారు. దిగుబడి సైతం బీజీ-2 కంటే 30శాతం మేర ఎక్కువగా వస్తుందని చెబుతున్నారు. పెట్టుబడిసైతం తగ్గుతుందని, పురుగుమందులు, దోమమందులు, తెగుళ్ల మందులు వినియోగించే అవసరం ఉండకపోవడంతో పెట్టుబడి సైతం 50 శా తం మేర తగ్గుతుందనే ప్రచారం బలంగా ఉండడంతో రైతులు సైతం బీజీ-3 విత్తనాల సాగుకు మొగ్గుచూపుతున్నారు. రైతులు బీజీ-2తో కలిపి బీజీ-3ని సాగుచేస్తున్న పరిస్థితి పలు ప్రాంతాల్లో కనిపిస్తోంది. నాలుగెకరా లు సాగుచేసే రైతులు మూడెకరాల్లో బీజీ-2 సాగు చేస్తే మరో ఎకరంలో బీజీ-3 సాగుచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దేవరకొండ, మిర్యాలగూడ, మునుగోడు, నల్లగొండ, మోత్కూరు తదితర ప్రాంతాల్లో బీజీ-3 సా గు గణనీయంగా ఉంటుందని, దీన్ని అధికారులు గుర్తించి నియంత్రించలేకపోతున్నార ని, గడచిన నాలుగైదేళ్లగా ఈ పరిస్థితి కొనసాగుతోందని, అందువల్లే పత్తి సాగు చేసే భూముల సారం తగ్గి, క్రమంగా దిగుబడులు తగ్గిపోతున్నాయ ని అవగాహన కలిగిన రైతులు, శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. బీజీ-3 సా గును విత్తన దశలోనే అరికట్టాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవ డం లేదనే విమర్శలు ఉన్నాయి.ప్రధానంగా గుజరాత్, మహారాష్ట్రలోని విత్త న కంపెనీలు వాటి ఆర్‌అండ్‌డీ విభాగాల ద్వారా ఉత్పత్తిచేసి ఏపీలోని గుంటూరు,సత్తెనపల్లి, మాచర్ల,కర్నూల్‌కు చెందిన వ్యాపారుల ద్వారా, మరోవైపున తెలంగాణలోని గద్వాల, భూత్పూర్ ప్రాంతాలకు చెందిన డీలర్ల ద్వారా, అక్కడి నుంచి ఏజెంట్లకు ఈ విత్తనాలను పకడ్బందీ గా సరఫరాచేస్తున్నారు. ఇటీవల ఉమ్మడి గుంటూరు జిల్లా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఈ విత్తనాలు భారీగా పట్టుబడుతుండడమే దీనికి నిదర్శనం.

నకిలీల మూలాలను కట్టడిచేస్తేనే

బీజీ-3, ఫెయిల్ విత్తనాలను మార్కెట్లోకి రాకముందే తయారీ సందర్భంలోనే కట్టడి చేయడమే వీటి నియంత్రణకు ఏకైక పరిష్కారమనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. ప్రధానంగా బీజీ-3 విత్తనాలను తీసుకువస్తున్న ముఠాలను గుర్తించి వారిపై పీడీయాక్ట్ ప్రయోగించాలని డిమాండ్ చేస్తున్నారు. విత్తనాల తయారీ కంపెనీలపై కట్టుదిట్ట చర్యలు తీసుకోవాలని, బీజీ-3, లూజ్ విత్తనాలను బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు సూచిస్తున్నారు. జర్మినేషన్ పరీక్షల తర్వాత ఫెయిల్ విత్తనాలను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుంటేనే ఈ సమస్యకు పరిష్కారమని రైతుసంఘాల నాయకులు సూచిస్తున్నారు.

వర్షాధారంగా సాగు చేసే రైతులే లక్ష్యం


మెట్ట ప్రాంతాల్లో వర్షాధారంగా పత్తిని సాగు చేసే రైతులకు లూజ్ విత్తనాలు అంటగడుతున్నారు. మార్కెట్లో ధర కంటే తక్కువకు వీటిని...

- మిగతా 7వ పేజీలో...

వ్యవసాయాభివృద్ధికి సహకార

బ్యాంకుల తోడ్పాటు

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి
- ఇండోనేషియా దేశంలో సదస్సుకు హాజరు



ఇండోనేషియాలో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాభివృద్ధికి సహకార బ్యాంకులు ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నాయని, వ్యవసాయ అనుబంధ రంగాల పురోగతికి భారత సహకార వ్యవస్థ అనుసంధానమై పనిచేస్తోందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇండోనేషియా దేశంలోని బాలి నగరంలో బ్యాంక్ ఆఫ్ ఇండోనేషియా ఆధ్వర్యంలో ఆసియా-పసిఫిక్ దేశాలకు చెందిన సహకార బ్యాంకులు వ్యవసాయరంగానికి ఎలాంటి తోడ్పాటు అందిస్తున్నాయనే అంశంతో పాటు భవిష్యత్‌లో చేపట్టాల్సిన సహకారంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రీజనల్ పాలసీ ఫోరం, 78వ ఆసియా-పసిఫిక్ రూరల్ అండ్ అగ్రికల్చర్ క్రెడిట్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఈ సదస్సును నిర్వహించగా, శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ, భారతదేశంలో సహకార రంగం, సహకార బ్యాంకులు వ్యవసాయ, అనుబంధ రంగాల పురోభివృద్ధిలో కీలక భాగస్వామ్యం వహిస్తున్నాయన్నారు. ప్రధానంగా నాణ్యమైన ఎరువులు, విత్తనాలను అందించడమేగాక ఔత్సాహిక రైతాంగానికి సబ్సిడీలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు, సేవాసంస్థల ఏర్పాటుకు సహకార బ్యాంకులు వెన్నుదన్నుగా నిలిచాయని పేర్కొన్నారు.

పర్యావరణ సహితమైన వ్యవసాయ అనుబంధపరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడమే లక్ష్యంగా సహకార బ్యాంకులు మరింత బలంగా పనిచేయాల్సి ఉందన్నారు. వ్యర్థాలను వీలైనంతమేర నియంత్రించేలా సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు కృషి చేయాల్సి ఉందని తెలిపారు. భారతదేశంలో వ్యవసాయరంగమే నేటికీ అత్యధిక భాగం జనాభాకు జీవనోపాధి అందిస్తోందని, కీలకమైన ఈ రంగంలో సాంకేతిక అవృద్ధికి, ఆధునిక సాగువిధానాలకు అవసరమైన ప్రోత్సాహకాలను అందించేలా సహకార బ్యాంకులకు తోడ్పాటు దక్కాలని పేర్కొన్నారు. ఈ నెల 28వరకు మూడురోజుల పాటు జరిగే ఇండోనేషియా పర్యటనలో వ్యవసాయరంగ అభివృద్ధిలో ఇండోనేషియా అవలంభిస్తున్న విధానాలను, అక్కడి సహకార బ్యాంకుల పనితీరు, వ్యవసాయ వ్యర్థాలు, కాలుష్య నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామని ఆయన తెలిపారు.

ఈ రోహిణిలో రోళ్లు పగలవ్!



రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయని పెద్దలు అంటుంటారు. సాధారణంగా మే నెలలో ఎండలు రారెత్తిస్తాయి. ఈ నెల 25 నుంచే రోహిణి కార్తె మొదలైంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండాకాలం చివరిలో పలు ప్రాంతాల్లో 44 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. మండే ఎండలకు జనం ఉక్కిరి బిక్కిరి అయ్యేవారు. ఎండ వేడిమికి తట్టుకోలేక వడదెబ్బకు ప్రాణాలు కోల్పోయేవారు. అయితే ఈ ఏడాది మాత్రం వేసవి సమ్‌థింగ్ స్పెషల్‌గా నిలిచింది.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- వేసవి సంథింగ్ స్పెషల్
- ఇలాంటి కూల్ సమ్మర్ లేదని నిపుణుల అభిప్రాయం
- 16ఏళ్ల తర్వాత ముందస్తు రుతుపవనాలు

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది వేసవి ప్రత్యేకతలను సంతరించుకుంది. ఎండల్లో హాయ్‌హాయ్.. అనే పరిస్థితి ఏర్పడింది. ఏప్రిల్‌లో విజృంభించే వేసవి ఛాయలు ఈసారి ఫిబ్రవరి నెలాఖరులోనే మొదలయ్యాయి. మే నెలలో మలమలా మాడ్చాల్సిన మండుటెండలు మనసు మార్చుకుని వర్షాలు కురిపిస్తున్నాయి. భయపెట్టే తీవ్ర వడగాడ్పుల జాడే లేకుండా పోయాయి. ఇక జూన్ ఆరంభంలోనే తాకాల్సిన నైరుతి రుతుపవనాలు ఎనిమిది రోజుల ముందుగానే కేరళలోకి ప్రవేశించాయి. అన్నింటికీ మించి రోళ్ల పగిలేలా ఎండలు ఉంటాయని చెప్పుకునే రోహిణి కార్తెలో చల్లని వాతావరణం ఏర్పడింది. మరోవైపు వచ్చే వారం పది రోజుల పాటు అల్పపీడనం, రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తూ పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3-5డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని వాతావరణశాఖ తాజాగా ప్రకటించింది.

ఈ ఏడాదిలో 43 డిగ్రీలకు మించలేదు

ఈ ఏడాది వేసవిలో మొత్తం ఉమ్మడి జిల్లాలో 43 డిగ్రీలకు మించి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదుకాలేదు. అదికూడా ఏప్రిల్ నెలలోనే నమోదయ్యాయి. ఈ సారి మే నెలలో 45డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని వాతావరణ నిపుణులు తొలుత అంచనా వేశారు. కానీ, మారిన వాతావరణ పరిస్థితులతో అందుకు భిన్నంగా ఉష్ణోగ్రతలు పడిపోయాయి. అయితే ఎండాకాలంలో అకాల వర్షాలు, ఈదురుగాలులతో జిల్లాలోని తుర్కపల్లి, రాజపేట, భువనగిరి, భూదాన్‌పోచంపల్లి, ఆలేరు, తదితర మండలాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రైతులు సుమారు రూ.14కోట్ల మేరకు పంట నష్టాన్ని చవిచూశారు. కాగా, ఈ సారి వడదెబ్బ మరణాలు కూడా చాలా తక్కువగా నమోదయ్యాయి.



16ఏళ్ల తర్వాత ముందస్తు రుతుపవనాలు...

గతంలో నైరుతి రుతుపవనాలు నిర్ణీత సమయం కంటే కొన్ని రోజులు ముందుగానే కేరళను తాకిన తరువాత కొద్దిరోజులకు వాతావరణం చల్లబడేది. రోహిణి కార్తె వేళ ఉష్ణతీవ్రత ఉండేదని వాతావరణ నిపుణులు వెల్లడిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం అందుకు భిన్నంగా మే నెలంతా కూడా వర్షాలు, మబ్బులతో చల్లదనాన్ని పరిచింది. గడిచిన ఏళ్లలో ఇలాంటి కూల్ సమ్మర్‌ను చూడలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎప్పుడైనా మే నెలలో తుఫాన్లు ఏర్పడితే ఐదారు రోజులు చల్లదనం ఉండేది తప్ప ఇంతలా ఎప్పుడూలేదు. 2009లో నైరుతి రుతుపవనా లు తొమ్మిది రోజులు ముందుగా రాగా, ఆ తర్వాత కూడా కొన్నాళ్ల పాటు ఎండలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం ఈ ఏడాది సెప్టెంబరుకు ముందే తుఫాన్లు వచ్చే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. రుతుపవనాలు ముందుగానే ప్రవేశిస్తే మంచి వర్షాలు కురిసేందుకు అనుకూల పరిస్థితులు ఉంటాయని వాతావరణశాఖ వెల్లడిస్తోంది.

పలకరించిన తొలకరి...

తొలకరి పలకరించడంతో పంటలను సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. వానాకాలం పంటలను ముందస్తుగానే సాగుచేసేందుకు సన్నద్ధమవుతున్నారు. వరి నార్పోడి పను లు చేసిన రైతులంతా దుక్కులు దున్ని, చేలను సిద్ధం చేస్తున్నారు. ఈ సీజన్‌లో యాదాద్రి జిల్లాలో వానాకాలంలో 4.50లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచింది. అందులో వరి, పత్తి అధికంగా సాగయ్యే అవకాశం ఉంది. సాధారణంగా 2.60లక్షల వరకు వరి సాగుకానుంది. ఈసారి పత్తి 1.15లక్షల ఎకరాల వరకు సాగుచేసే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు 73,750క్వింటాళ్ల విత్తనాలు సిద్ధంగా ఉంచారు. జిల్లావ్యాప్తంగా 13,575 ఎకరాల్లో కూరగాయల తోటలు సాగవుతుండగా, ఈసారి కూరగాయల సాగును 20వేల ఎకరాలకు పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎస్పీ శరత్‌చంద్ర పవార్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పోలీస్‌శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 45 మంది అర్జీదారుల ఫిర్యాదులను ఎస్పీ తీసుకొని వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సదరు సమస్యలపై పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, బాధితుల సమస్యల తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు తీసుకోవాలన్నారు ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఫిర్యాదుదారుడికి పోలీసులపై భరోసా కల్పించాలన్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా నారాయణ్‌అమిత్


ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ సబ్ కలెక్టర్, ఐఏఎస్ అధికారి నారాయణ్ అమిత్‌కు ఇన్‌చార్జి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల)గా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన కలెక్టర్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. సెలవు నుంచి తిరిగి వచ్చిన అదనపు కలెక్టర్(రెవెన్యూ) జె.శ్రీనివాస్ సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించిన నారాయణ్‌అమిత్ ఇకపై అదనపు ఇన్‌చార్జి కలెక్టర్ (స్థానిక సంస్థల)గా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఇప్పటి వరకు గృహ నిర్మాణశాఖ పీడీ రాజ్‌కుమార్ స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. కాగా, బాధ్యతలు తీ సుకున్న నారాయణ్‌అమిత్‌కు కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): భూముల సర్వేలో సర్వేయర్ల పాత్ర కీలకమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. సోమవారం ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన లైసెన్స్ సర్వేయర్ల ధ్రువపత్రాల పరిశీల న,సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 26 నుంచి సుమారు 50 పనిదినాలు సర్వేయర్లకు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతర్గత సరిహద్దుల నిర్ణయంలో, వివాదాల పరిష్కారంలో సర్వేయర్లది కీలకపాత్ర అన్నారు. శిక్షణకు హాజరైన సర్వేయర్లు జాగ్రత్తగా అన్ని అంశాలను అర్థం చే సుకోవాలన్నారు. అనంతరం 150 మంది లైసెన్స్ సర్వేయర్లకు సర్వే సామగ్రిని పంపిణీ చేశారు. కాగా, జిల్లా లో లైసెన్స్ సర్వేయర్లు మీ-సేవ ద్వారా 819 మంది దరఖాస్తు చేసుకోగా, మొదటి విడత సోమవారం 409 మంది ధ్రువపత్రాలు పరిశీలించారు. రెండో విడత ఆగ స్టులో మరో 410 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. కార్యక్రమంలో సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఇన్‌చార్జి ఏడీ సుజాత, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్స్ రమణయ్య, సూపరింటెండెంట్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితాను రూపొందించాలి

జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌లో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల వారీగా పంపించిన రైతు ఆత్మహత్యల జాబితా, సీఎం ప్రజావాణి ద్వారా వచ్చిన వితంతు పెన్షన్ కుటుంబాల జాబితా ఆధారంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలన్నారు. అర్హులు సంబంధిత తహసీల్దార్‌కు దరఖాస్తు చేయవచ్చన్నారు. వీటిపై తహసీల్దార్లు విచారణ నిర్వహించి జాబితాను ఆర్డీవోకు, అక్కడి నుంచి జిల్లా రెవెన్యూ అధికారికి, ఎస్‌ఎస్ డైరెక్టర్, సెర్ప్ సీఈవోకు ఆన్‌లైన్ ద్వారా పంపిస్తామన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాలకు స్థలాలను కేటాయించాలి

జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జిల్లాకు మంజూరైన 22 ఆరోగ్య ఉప కేంద్రాలకు వెంటనే స్థలాలు కేటాయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. వారం రోజుల్లో 22 నూతన సబ్ సెంటర్లకు స్థలాలను గుర్తించి కేటాయించాలన్నారు. ఈ విషయానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, సూపరింటెండెంట్ ఇంజనీర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

'ప్రజావాణి' ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకొని ఆమె మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లు, ధర్తి ఆబా యోజన, జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం, పౌరసరఫరాలశాఖపై సమీక్ష నిర్వహించారు. వానాకాలంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలతోపాటు, అంతర్ పంటలు సాగుచేసేలా ప్రోత్సహించాలని, అందుకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలి


బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నేత మధుసూదన్‌రెడ్డి


నిరసన తెలుపుతున్న కిసాన్‌మోర్చా నాయకులు

నల్లగొండ టౌన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు నాణ్యమై విత్తనాలు, ఎరువులు అందించాలని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ నాయకుడు, ఆ పార్టీ కేరళ రాష్ట్ర ఇన్‌చార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. సోమవారం కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించి కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టి రైతులకు నాణ్యమైనవి సకాలంలో అందజేయాలన్నారు. అదేవిధంగా నకిలీ విత్తనాలు అరికట్టేందుకు జిల్లా స్థాయిలో విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు రుణమాఫీ చేసి రైతుభరోసా డబ్బు వెంటనే జమచేయాలన్నారు. యాసంగిలో విక్రయించిన సన్న ధాన్యానికి వెంటనే బోనస్ చెల్లించాలన్నారు. ప్రధాన మంత్రి ఫసల్‌బీమాను వర్తింపజేయాలని, మిల్లెట్‌పంటలను ప్రోత్సహించాలని, సబ్సిడీపై వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం వెంకట్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్, నాయకులు పోతెపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పాపిరెడ్డి, మహేష్, హనుమంతురెడ్డి, అశోక్‌రెడ్డి, సాయన్న, నవీన్‌రెడ్డి, రమణముదిరాజ్, రాజయ్య, కోటేశ్వర్‌రెడ్డి, పాల్గొన్నారు.

జేడీఏతో రేపు ఫోన్ ఇన్

- ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
- సంప్రదించాల్సిన నెంబర్ 8977751296



నల్లగొండ, మే 26 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ సమీపిస్తుండటంతో జిల్లా రైతాంగానికి వ్యవసాయ సంబంధిత సమాచారం అందించేందుకు ఈనెల 28న బుధవారం జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్‌తో 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసింది. వానాకాలం సీజన్‌లో కావాల్సిన ఎరువులు, విత్తనాలతో పాటు ఇతర అంశాల గురించి జేడీఏను రైతులు ప్రశ్నించవచ్చు. రైతులు సెల్ నెంబర్ 8977751296కు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కోరారు.

నేటి నుంచి సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

చింతపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో మంగళవారం నుంచి ఈ నెల 29 వరకు 18వ వార్షికోత్సవాలకు నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు చైర్మన్, సభ్యులు సోమవారం తెలిపారు. ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్నం, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ ట్రస్టు చైర్మన్ ధనుంజయ్య చెప్పారు.

టీబీ నివారణకు కృషి

చింతపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): టీబీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల క్లస్టర్ వైద్యాధికారి శ్రీదేవి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సోమవారం ఆమె మాట్లాడారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా..

- మిర్యాలగూడ మునిసిపాలిటీ ఆధ్వర్యంలో వంద రోజుల ప్రణాళిక
- జూన్ 2 నుంచి అమలుకు చర్యలు



(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

మిర్యాలగూడ మునిసిపాలిటీ సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకు పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు మరింత వేగవంతమయ్యేలా వంద రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించింది. ఈ యాక్షన్ ప్లాన్ అమృత్ మిత్ర ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి వందరోజుల పాటు నిర్వహించాలని మునిసిపల్ అధికారులకు ఆదేశాలను జారీ చేసింది. రోజువారీ పనులు నిర్వహిస్తూనే ఈ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పట్టణంలో పారిశుధ్యం, పార్కులు, ఆస్తిపన్ను, మంచినీటి కనెక్షన్ సమస్యలను గుర్తించి వాటిని ఈ వంద రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది.

ప్రణాళికలోని అంశాలివే..

100 రోజుల యాక్షన్ ప్లాన్‌లో అభివృద్ధి పనులతో పాటు ఆదాయమార్గాలపై అధికారులు దృష్టి సారించనున్నారు . తొలుత పచ్చదనానికి ప్రాధాన్యతనిస్తూ పట్టణ పరిధిలో ఖాళీ స్థలాలను గుర్తించి మొక్కలు నాటుతారు. నిరంతరం మొక్కలు అందుబాటులో ఉండేలా నర్సరీలను ఏర్పాటు చేస్తారు. ఇక సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్య శాఖ సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. అమృత్ నిధులతో పబ్లిక్ హెల్త్ శాఖ పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయనున్నారు. వందరోజుల కార్యాచరణలో ఆస్తి, నీటి, వాణిజ్య పన్నుల వసూళ్లపై వారాంతపు సమీక్షలు నిర్వహిస్తారు. వార్డు ఆఫీసర్లను వార్డుల వారీ నోడల్ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించనున్నారు. ఆస్తుల వివరాల కచ్చిత నమోదుకు చేపట్టిన భువన్ సర్వే ఇచ్చిన వివరాలను కంప్యూటర్లలో నిక్షిప్తం చేయనున్నారు. మెప్మా ఆధ్వర్యంలో వీధి వ్యాపారులు, మహిళా సంఘాలకు అర్హత మేరకు రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపట్టనున్నారు.

ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం



పురపాలక శాఖ ఆదేశాల మేరకు పరిశుభ్రత, పచ్చదనంతో పాటు అభివృద్ధి అంశాలతో కూడిన వందరోజుల ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. మొక్కలు నాటడం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. వార్డుల వారీగా నోడల్ ఆఫీసర్లను నియమించి నూరు రోజుల పాటు రోజు వారీ నివేదికలు తీసుకుంటాం.

-యూసుఫ్, మునిసిపల్ కమిషనర్

సమాచారం

ఎక్సైజ్ శాఖ సీజ్ చేసిన వాహనాలకు రేపు వేలం

దేవరకొండ, మే 26(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఎక్సైజ్ పరిధిలో తనిఖీల్లో సీజ్ చేసిన వాహనాలకు బుధవారం ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ద్విచక్ర వాహనాలకు రూ. 10 వేలు, 4 చక్రాల వాహనాలకు రూ.30వేలు డిపాజిట్ చేయాల్సి ఉంటుందని సూచించారు. పూర్తి వివరాల కోసం ఎక్సైజ్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు.

సినిమా గైడ్

మిర్యాలగూడ: శ్రీనివాస	: సింగిల్
వెంకటేశ్వర	: ఏస్
రాఘవ	: హిట్ 3
విట్రోస్	: ఏస్, వర్షం
దేవరకొండ : మనోజ్	: ---
మైత్రి వెంకటేశ్వర	: శుభం

కాంగ్రెస్ పట్టణాధ్యక్ష పదవి ఇవ్వండి

- మిర్యాలగూడ మాజీ వార్డు కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాస్

మిర్యాలగూడ, మే 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని మాజీ వార్డు కౌన్సిలర్ కొమ్ము శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్ఆర్ బ్రదర్స్ చేపట్టిన అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని తోడ్పాటునందించినట్లు తెలిపారు. పార్టీలో సేవలను గుర్తించి పార్టీ పట్టణ అధ్యక్ష పదవి కేటాయించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

పేదల సంక్షేమానికి నిబద్ధతతో పనిచేస్తున్నాం

- ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ● ఆస్తి పంపకం కోసమే బీఆర్ఎస్‌లో కుటుంబ కలహాలు



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

పెద్దవూర, మే 26(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని 126 మంది లబ్ధిదారులకు రూ. 1.26కోట్ల కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. 1996 నుంచి ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారుల బ్యాంక్ రుణాల నుంచి రుణ విముక్తులను చేసి ఉమ్మడి పెద్దవూర గ్రామంలో 560 ఇందిరమ్మ ఇళ్ల స్థలాలకు పట్టాలను పంపిణీ చేశామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో దాచిన డబ్బులు ఎక్కడెక్కడో ఉన్నాయో వెతుక్కుంటూ పంపిణీలో తేడాలు వచ్చి కేసీఆర్ కుటుంబంలో కలహాలు చెలరేగాయని అన్నారు. కానీ ఇప్పటి వరకు ప్రజల కోసం ఉత్తరాలు, కొట్లాటలు చేయలేదని, కేవలం వాళ్ల పంపకాల్లో తేడాలు రాబట్టే ఇప్పుడు వారి కుటుంబంలో ఉత్తరాలు నడుస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని, ఓడిపోతున్నామనే ఆందోళనతో 2018లో మాత్రమే రైతబంధు ఇచ్చి ఓట్లను దండుకుందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, తహసీల్దార్ జయశ్రీ, పీఏసీఎస్ చైర్మన్ గుంటుక వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పబ్బు యాదగిరిగౌడ్, చామల సువర్ణ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడి తదితరులుపాల్గొన్నారు.



అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు

అటవీ భూములను పరిరక్షించాలి

మిర్యాలగూడ టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): అటవీ భూములను పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్య యాదవ్, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సురేష్ మాట్లాడుతూ దామరచర్ల మండలం రాజగట్టు బ్లాక్ పరిధిలోని అటవీ భూములను అక్రమార్కులు తాజాగా ఆక్రమించుకుంటున్నారన్నారు. ఈ విషయమై అటవీరేంజర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గతంలో బీఆర్ఎస్ నాయకులు ఇదే ప్రాంతంలోని అటవీ భూములను ఆక్రమించుకోగా కలెక్టర్, అటవీ శాఖ సర్కిల్ ఆఫీసర్లకు ఫిర్యాదు చేశామన్నా రు. సదరు అధికారులు విచారణ జరిపి నివే దిక అందించాలని ఆదేశించినా స్థానిక ఫారెస్ట్ ఆఫీసర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అటవీ భూములను పరిరక్షించాల్సిన అధికారులు, సిబ్బంది ఆక్రమణలకు గురవుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో సంఘాల నేతలు సయ్యద్ ఫారూఖ్, ఇస్లావత్ సైదానాయక్, పరంగి సురేష్, జక్కా నాగేశ్వరరావు, గంధం దేవేందర్, సూర్యానాయక్, జగన్‌నాయక్ పాల్గొన్నారు.

కోతుల బెడద నివారణకు చర్యలు

- దేవరకొండలోని 3 వార్డుల్లో బోనుల ఏర్పాటు



యూపీఎస్ పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన బోను

దేవరకొండ, మే 26(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపాలిటీ ప్రజలు కొంతకాలంగా కోతుల బెడదతో ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని 2వ వార్డు, ఖిల్లాబజార్, హనుమాన్‌నగర్, గాంధీ బజార్, శివాజీనగర్, అంజయ్యకాలనీ, బస్టాండ్ కాలనీల్లో కోతులు గుంపులు, గుంపులుగా ఇళ్లలోకి వస్తున్నాయని పట్టణవాసులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు అనంతపురం జిల్లా నుంచి కోతులు పట్టే వారిని రప్పించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని పాఠశాల ఆవరణం, సంజయ్యకాలనీల్లో కోతులను పట్టేందుకు బోనులను ఏర్పాటు చేశారు. బోనుల్లో వేరుశనగకాయలు, తినుపదార్థాలు వేసి తెరిచి ఉంచుతారు. వేరుశనగకాయలు తినేందుకు కోతులు బోనులోకి వెళ్లగానే బోను మూసేసి పట్టుకుంటారు. అనంతపురం జిల్లా నుంచి ముగ్గురిని రప్పించి చర్యలు తీసుకుంటున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురిగి శంకర్ తెలిపారు.

'పశువైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

తిరుమలగిరి(సాగర్), మే 26(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రంలో భార్య ఉద్యోగం చేస్తున్న భర్తపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. పశువైద్యశాలలో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఓ మహిళకు బదులుగా భర్త విధులకు హాజరవుతూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నాడని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గతంలో మండల పశువైద్యాధికారికి ఫిర్యాదు చేయగా ఆయన ఎప్పటి నుంచో విధుల్లో కొనసాగుతున్నాడని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పాడని వివరించారు. అదేవిధంగా సంబంధిత పశు వైద్యాధికారి కూడా సరిగా విధులకు హాజరు కావడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు చేసిన సీపీఎం మండల కమిటీ సభ్యుడు జగదీష్, శివ, గోపి ఉన్నారు.

దేశ సంపదను పెట్టుబడిదారులకు పంచుతున్న మోదీ : సీపీఐ



దామరచర్లలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు వెంకటేశ్వర్లు

పెద్దఅడిశర్లపల్లి,మే26(ఆంధ్రజ్యోతి): దేశ సంపదను మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు పంచుతుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి అన్నారు.మండలంలోని అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద సోమవారం నిర్వహించిన ఆ పార్టీ 15వ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్రమోదీ విధానాల వల్ల కార్పొరేట్ సంస్థల లాభాలు గరిష్ఠ స్థాయికి చేరాయన్నారు. 2024-25 సంవత్సరం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి లక్ష కోట్లు కూడా కేటాయించలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి,మండల కార్యదర్శి కుంభం జయరాములు, భాస్కరెడ్డి, నూనె కాంతారావు, ఆంజనేయులు, మల్లాచారి, మోహన్, నారాయణరెడ్డి,వెంకటయ్య, రాంజీ, రఘు, బ్రహ్మచారి, అంజన్‌రాజు పాల్గొన్నారు.

కబ్జాలో ఉన్న వారికి బేషరతుగా పట్టాలివ్వాలి :

మిర్యాలగూడ : తాళ్లగడ్డలో కబ్జాలో ఉన్నవారికి బేషరతుగా ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. తాళ్లగడ్డలో సోమవారం నిర్వహించిన పార్టీ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. దినసరి కూలీలుగా పనిచేస్తున్న పేదలు తాళ్లగడ్డలో తక్కువ ధరకు ఇంటి స్థలాలు వస్తున్నాయంటే కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని అన్నారు. ప్రస్తుతం అధికారులు ఆ భూములు చెరువు శిఖానికి సంబంధించినవి . ఆ ఇళ్లను కూలగొడతామని అంటున్నారని ప్రజలు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఎర్రబోతు పద్మ, అంజమ్మ, ఎస్‌కే. షమీం, శ్రీనివాసరెడ్డి, ముత్తు లింగం, సులోచన, పాల్గొన్నారు.

నర్సాపూర్‌కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

దామరచర్ల :మండలంలోని నర్సాపూర్‌కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి ధీరావత్ లింగనాయక్ కోరారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాలనీలో కరెంట్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, విద్యుత్ తీగలు ఇళ్ల మీద నుంచి వెళ్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని నూతన స్తంభాలు వేసి తీగలను సరిచేయాలని అన్నారు. అలాగే డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. సమావేశంలో జమ్ముల కోటయ్య, పోలేపల్లి ఉదయ్, రాములు, శాంత, నిర్మల, సంప్లి, తులసీ, చందన బోయిన శ్రీను పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వేములపల్లి, మే26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద గల మహర్షి విద్యామందిర్ పాఠశాల 1998 బ్యాచ్ సోమవారం పూర్వ విద్యార్థులు సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆ ప్యాయంగా పలకరించుకొని గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ ఉన్నతికి దోహదం చేసిన నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. నాటి పూర్వ విద్యార్థుల్లో నేడు వ్యవసాయరంగంలో తమదైన పాత్ర పోషిస్తున్న విద్యార్థులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పేరెల్లి నగేష్, అనంతుల దిలీప్, గాజుల నాగరాజు, గుత్తా చరణ్‌రెడ్డి, శ్రీనివాస్, మద్దిరాల మహేశ్వర్‌రెడ్డి, పేరెల్లి వినయ్, వెంకన్న, నిరంజన్‌రెడ్డి, విజయ్, సైదులు, రాము, పురుషోత్తం పాల్గొన్నారు.

తక్కెళ్లపల్లిలో బోనాల పండుగ

చింతపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కెళ్లపల్లిలో రజకసంఘం ఆధ్వర్యంలో బోనాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం ఎత్తుకొని గ్రామదేవత వద్దకు ర్యాలీగా చేరుకొని సమర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గుండ్లపల్లి అనితానరసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పోగాకు శ్రీశైలం, పోతగోని రామస్వామిగౌడ్, జగన్, జగదీష్, నరేష్, కరుణాకర్, యాదయ్య పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులు వినియోగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏవో సరిత

హాలియా, మే26(ఆంధ్రజ్యోతి): భూసార పరిరక్షణకు సేంద్రియ ఎరువులను వినియోగించాలని అనుముల మండల వ్యవసాయాధికారి సరిత అన్నారు. మండలంలోని కొత్తపల్లి గ్రామ రైతు వేదికలో మద్రాస్ ఫర్టిలైజర్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కిసాన్ సంగోష్ఠి పీఎం ప్రాణమ్ పథకంలో భాగంగా సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులకు సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రసాయన ఎరువులను వినియోగించడం వల్ల ప్రతి ఏటా భూసారం తగ్గిపోతుందని దీంతో రాబోయే రెండు, మూడు తరాల్లో వ్యవసాయానికి ఉపయోగపడే భూమి ఎక్కడా లేకుండా పోతుందన్నారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువులు, గ్రీన్ మ్యానూ ర్‌ను ఎక్కువ వినియోగిస్తే నేలలో భూసారం పెరుగుతుందని సూచించారు. ప్రతిరైతు ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకొని రైతు గుర్తింపుకార్డు పొందాలని ఈనెల 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. కార్యక్రమంలో మద్రాస్ ఫర్టిలైజర్స్ ప్రైవేటు లిమిటెడ్ మిర్యాలగూడ రామారావు, బ్రహ్మానందరెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, కోటిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొండలు, కట్ల సైదులు, ముత్యాలు, ఆవుల రామయ్య, వంగ గోవిందు, మట్టారెడ్డి, రాజేష్, నర్సిరెడ్డి, చింతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలి

డిండి, మే 26(ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పాపిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఉపాధ్యాయ బృందం సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతయ్య, యాదయ్య, సత్యనారాయణ, రహమత్‌ఖాజా, సుజాత, సరోజ, పావని, సృజన, వెంకన్న, ధనమ్మ, నవనీత, లివినా తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి



మిర్యాలగూడలో జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జర్నలిస్టులు

మిర్యాలగూడ రూరల్, మే 26(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఈనెల 31న నిర్వహించనున్న టీజేఎఫ్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే(హెచ్- 143) జిల్లా అధ్యక్షుడు గుండగోని జయశంకర్‌గౌడ్ అన్నారు. సోమవారం పట్టణంలో జర్నలిస్టుల జాతర పోస్టర్‌ను ఆవిష్కరించి అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో టీజేఎఫ్ కీలక పాత్రను పోషించిందన్నారు. జలవిహార్‌లో నిర్వహించనున్న జర్నలిస్టుల జాతరకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శేషరాజుపల్లి వీరస్వామి, దండ భాస్కర్, మల్లె నాగిరెడ్డి, విరగాని లక్ష్మీనారాయణ, బొంగరాల మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారం అలవాట్లను మార్చుకోవాలి : జేవీవీ

వేములపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యానికి ఆహారపు అలవాట్లను మార్చుకోవాలని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకుడు పాదూరి రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆమనగల్లు గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి రోజువారి దైనందిన జీవితంలో తీసుకోవాల్సిన ఆహార మార్పుల గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు సత్యనారాయణరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్, మే 26(ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. స్థానిక బీసీ భవన్‌లో సోమవారం ఆయన మాట్లాడా రు. జనాభాలో అధికశాతమున్న బీసీలకు చట్టసభల్లో సముచిత స్థానం కల్పి ంచాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ ఎమ్మెల్యేలను మంత్రులను చేస్తే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో జరిగే మంత్రివర్గ విస్తరణలో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో బోయిన ఉపేందర్, దాజ రాజు జయరాజు, మహేష్‌గౌడ్, గంగాధర్, సురేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

చింతపల్లి, మే 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీదేడు గ్రామంలో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ రమాకాంత్‌శర్మకు వినతి పత్రం అందజేశారు. గ్రామానికి చెందిన వ్యక్తి భూమిని ఆక్రమించురాని ఇష్టారాజ్యంగా బోరు వేసి పక్కనే నక్షబాటను కూడా కబ్జా చేసి సాగు చేస్తున్నాడని పేర్కొన్నారు. అడ్డుకుంటున్న వారిపై దాడికి పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వీరమళ్ల శ్రీనివాస్, వెంకటయ్య, ఎం.రాములు, సుదర్శన్ పాల్గొన్నారు.